చావు కాచుకో?

మిస్. మధుబాల

"మిస్టర్ కృష్ణకుమార్..." రాగిణి ఒక్కొక్క పదాన్ని ఒత్తిపలుకుతూ అంది.

"నీవు హైద్రాబాద్ సెంట్రల్ జైలునుండి పారిపోయిన పన్నెండుమంది అపరాధులలో ఒకడివి అయిన కృపాల్ సింగ్‌వి. నీవు 'రావ్ అండ్ చారి' కంపెనీలో ఉద్యోగం చేస్తున్న కాలంలో కంపెనీసొమ్ము యాభయివేల రూపాయలు మాయంచేశావు. కాని పట్టుబడ్డావు. న్యాయస్థానం నీకు రెండేళ్లు జైలుశిక్షను విధించింది. రెండేళ్ళక్రితం నీ శిక్షాకాలం ఇంకా ఆర్నెల్లు వుందనగా నీవు జైలునుండి పారిపోవడంలో సఫలీకృతుడవు అయినావు. జైలునుండి నీవు ఎలా

పారిపోయావు—ఆ విషయం చెప్పాల్సిన అవసరం లేదనుకుంటూను."

నేను అదిరిపడ్డాను. ఆశ్చర్యంతో రాగిణినే చూస్తూండిపోయాను.

నిజంగా ఆవేళ రాత్రి ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్ అవటంవల్ల జైలులో భయంకరంగా మంటలలుముకున్నాయి. అప్పుడు జరిగిన గందరగోళంలోనే ఎందరో ఖైదీలకు పారిపోయే అవకాశం లభించింది. ఇతర ఖైదీలతోపాటు నేను కూడా ఏమీ ఆలోచించకుండా పరుగెత్తాను. ఆ తరువాత ఎందరో ఖైదీలు తిరిగి పట్టుబడ్డారు. కాని నేను పట్టుపడలేదు. నేను నా గడ్డము, మీసాలు తీసేసి, జుత్తుని కత్తిరింప చేశాను. దాంతో నా రూపం బాగా మారిపోయింది. ఆ తర్వాత నేను హైద్రాబాద్ వదిలి ఇక్కడికి, బొంబాయికి చేరుకున్నాను.

"రెండు సంవత్సరాలక్రితం పరారయిన ఖైదీ కృపాల్ సింగ్ తన గడ్డం, మీసాలు తీసేసి ఇక్కడ లాల్‌చంద్ ఎస్టేట్‌లో పనిచేస్తున్నాడని, అతను తన పేరు కృష్ణకుమార్‌గా మార్చుకున్నాడని పోలీసులకి తెలిసిన మరుక్షణం నీవు తిరిగి ఇనుపచువ్వల వెనుక వుంటావు."

నేనేమీ మాట్లాడలేదు; కాని, నా మెదడు వేగంగా పని చేస్తూంది.

"ఒకవేళ నీవు ఇక్కడినుండి పారిపోవాలి అనుకున్నట్లయితే ఆ ఆలోచన మానేయి" రాగిణి అంది.

నేను ఆశ్చర్యంగా రాగిణిని చూడసాగాను. నిజంగా ప్రస్తుతం నేను యీ ఎస్టేటేకాదు, బొంబాయినే వదిలి పారిపోవాలని ఆలోచిస్తున్నాను.

"నేను ఏ కృపాల్‌సింగ్‌ని ఎరగను" దబాయించబోయాను.

"అంటే, నిన్ను నీవే ఎరగవన్నమాట?"

"మీరు చెబుతున్నది నా పేరుకాదు. నా పేరు కృష్ణ కుమార్."

"పేరు మార్చుకున్నంత మాత్రాన మనిషి మారడు మిస్టర్," రాగిణి తీవ్రంగా అంది. "అంతేకాదు; నేను నిన్ను ఇప్పుడు గుర్తుపట్టానని మాత్రం అనుకోవద్దు; నేను నిన్ను మొదటిసారి చూసినప్పుడే గుర్తించాను."

ఈసారి నేను నిజంగానే వులిక్కిపడ్డాను.

"కాదు," నమ్మలేనట్లుగా అన్నాను.

"ఫూలిష్‌గా ప్రవర్తించక. నేను నిన్ను ఎలా గుర్తుపట్టాను అని అడుగు."

"ఎలా గుర్తించారు?" అనుకోకుండానే ఈ ప్రశ్న నా నోటినుండి వచ్చింది.

"నేను నిన్ను హైద్రాబాద్‌లో సీవురావ్ అండ్ చారి కంపెనీలో అసిస్టెంట్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్నప్పటి నుండి ఎరుగుదును."

"ఎలా?"

"నీ భార్య 'కుల్‌దీప్' నేను మంచి స్నేహితురాళ్ళం. నేను చాలాసార్లు హైద్రాబాద్‌లో మీ ఇంటికికూడా వచ్చాను. అప్పటికి నీకు నీ అందమయిన భార్య ముఖం తప్పితే మరో ఆడదాని ముఖమే కనిపించేదికాదు."

"కాని; నేను మిమ్మల నెప్పుడూ చూడలేదు."

"ఒకవేళ చూసివున్నా గుర్తుపట్టేవాడివికాదు. ఎందుకంటే అప్పుడు నేను ఒక సామాన్యమయిన స్త్రీని. ఇప్పుడు కోట్లకు అధిపతి అయిన లాల్‌చంద్‌కు పత్నిని."

నేనేమీ మాట్లాడలేదు.

రాగిణి తన గౌనులోంచి ఒక న్యూస్ పేపర్ కటింగ్ తీసి దానిని విప్పి నాముందు పరచింది.

ఆ కటింగ్‌లో వరుసకు ముగ్గురు చొప్పున పన్నెండుగురు వ్యక్తుల ఫోటోలు ప్రచురించి వున్నాయి. పైన పెద్ద పెద్ద అక్షరాలతో 'పారిపోయారు' అని వుంది. ప్రతి ఫోటో క్రింద పేర్లు వ్రాసివున్నాయి. అందులో యువకుడయిన ఒక సర్దార్జీ ఫోటో క్రింద 'సర్దార్ కృపాల్ సింగ్' అని వ్రాసి వుంది.

"నీవు తిరిగి జైలుకి వెళ్ళాలనుకుంటున్నావా? లేక నేను చెప్పినట్లు విని లక్షాధికారి అయి, గౌరవనీయమయిన జీవితం గడపాలనుకుంటున్నావా? ఏదో ఒక విషయం వెంటనే తేల్చి చెప్పు?" ఆమె అంది, ఆమె కంఠంలో నాకు బెదిరింపు కూడా కనిపించింది.

"మేడమ్!" నన్ను నేను స్థిమిత పరచుకుంటూ అన్నాను.

"అవును. నీవు సర్‌లాల్‌చంద్‌ను అంటే నా రోగిష్టి ముసలి భర్తను హత్యచేయాలి. అది కూడా సింపుల్. ఇవాళ అతణ్ని వీల్ చెయిర్ నుండి నీవు మంచం మీదికి చేరుస్తూ, చెయిర్ అడ్డం రావడంవల్ల, తడబడి నిలదొక్కుకున్నావు. మరోసారి అలా నిలదొక్కుకో నవసరంలేదు. అంతే! దాంతో పని పూర్తవుతుంది. నాకూ స్వేచ్ఛ లభిస్తుంది, నిన్నూ లక్షాధికారిని చేస్తాను. అంతటితో మన మధ్య సంబంధం పూర్తవుతుందని ఎందుకనుకుంటావు. నీవు చేసిన యీ సహాయానికి ప్రతి ఫలంగా, నీవు ఎప్పుడు కావాలన్నా, నా అందం, యవ్వనం నీ పరం చేస్తాను."

"ఈ పనిని మీరు, నాస్థానంలో నా కన్నా ముందున్న యూసుఫ్‌తో ఎందుకు చేయించలేదు. అతనికి వుద్యోగమిప్పించింది కూడా మీరే కదా?"

"వాడు వట్టి మూర్ఖుడు. నేను ప్రయత్నం చేశాను. అతను లొంగి పోయాడు కూడా?! కాని, అతని వ్యవహారం చూస్తే, ఎవరయినా అతను కావలనే అలా ప్రవర్తించాడని అనుమా

నించే ఆస్కారముంది. ఒకసారి అతను కావలని సర్‌లాల్ చంద్‌ని వదిలేశాడు. ప్రక్కనే నర్స్ జూలీ వుంది. ఆమె సమయానికి లాల్‌చంద్‌ని క్రింద పడకుండా పట్టుకుంది. అతని ఆ ప్రవర్తన డాక్టర్ గుప్తకు కోపం తెప్పించింది. అతను వెంటనే యూసుఫ్‌ని పనిలోంచి తీసేయించాడు.''

రాగిణి ఒక్కక్షణం ఆగి తిరిగి చెప్పసాగింది. ''ఆ రోజు నేను నా స్నేహితురాలొకావిడను సెండ్ ఆఫ్ ఇవ్వడానికి 'విక్టోరియా' స్టేషన్‌కి వెళ్ళాను. అక్కడ అనుకోకుండానే నా దృష్టి నీపై పడింది. ఆ తర్వాత నిన్ను అనుసరించి నీవెళ్ళిన రెస్టారెంట్ ప్రక్కనున్న టెలిఫోన్ బూత్‌లోకి వెళ్ళాను. నేను అందులోకి వెళ్ళటం నీవు గమనించావని నాకు తెలుసు. కావలనే నేను పదివేల రూపాయలున్న నా హాండ్‌బ్యాగ్‌ని బూత్‌లో వదిలివచ్చాను. నేననుకున్నట్లు గానే, నేను బ్యాగ్ మరచిపోయి రావడం నీవు గమనించి అందులోని డబ్బుని మాయం చేశావు; అంతలోనే నేను తిరిగి వచ్చి నిన్ను రెడ్‌హాండెడ్‌గా పట్టుకున్నాను. అయినా నేను నిన్ను పోలీసులకి పట్టివ్వక నీ వాస్తవాన్ని బయట పెట్టకుండా, నిన్ను ఈ ఎస్టేట్‌లోకి తీసుకువచ్చి ఉద్యోగం ఇప్పించాను.''

''నేను మీరు చెప్పినట్లు చేస్తానని ఎలా అనుకున్నారు?''

''అందమూ, వయస్సు గల ఆడది తనంత తానుగా కోరి రావడంతో పాటు లక్ష రూపాయలకు అధికారివి కూడా కావచ్చునన్న ఆశ, నా పని పూర్తయ్యేలా చేస్తుందని అనుకున్నాను. అయినా ఒకసారి తప్పుచేసిన వ్యక్తి రెండవసారి సులభంగా తప్పుచేయడానికి లొంగిపోతాడుకూడా.''

''నిజమే! మీరన్నట్లు ఒకసారి అపరాధం చేసినవాడు మరోసారి సులువుగా అపరాధం చేయడానికి ఒప్పుకుంటాడు.

కాని, ఆ పాలసీ నాకు వర్తించదు. ఎందుకంటే నే నింత వరకు ఒక్కసారికూడా అపరాధం చేయలేదు, అపరాధిని కాను."

"అంటే నీవు 'రావ్ అండ్ చారి' కంపెనీనుండి యాభై వేల రూపాయలు మాయంచేసి జైలుకి వెళ్ళలేదంటావా?"

ఆ విషయాలు జ్ఞాపకంవచ్చి నేనొకసారి దీర్ఘంగా నిట్టూర్చాను. "మేడమ్, నేను చెప్పిన దానిని నమ్మమని నేను ఒత్తిడి చేయను, కాని నేను నమ్మిన భగవంతునిపై ప్రమాణం చేసి చెబుతున్నాను, ఆ డబ్బు నేను దొంగతనం చేయలేదు. ఇందులో నేను ఇరికింపబడ్డాను."

"నో" నమ్మలేనట్లుగా విస్ఫారిత నేత్రాలతో నన్ను చూస్తూ అంది రాగిణి,

"కాని; వార్తలు మరే!"

"మరి...మరి...నువ్వు ఇందులో ఎలా ఇరుక్కున్నావు?"

"అదొక పెద్ద కథ" మళ్ళీ ఒకసారి దీర్ఘంగా నిశ్వసించి అన్నాను. "ఆ రోజుల్లో నా జీవితం పూలబాటలా వుండేది. చక్కని ఉద్యోగం, అందమైన భార్య...ఆ రోజుల్లో ప్రతి వ్యక్తి మంచివాడులాగే కనిపించేవాడు నా కళ్ళకి. నాకు చెడురోజులు ప్రాప్తించినవి. నా భార్య కుల్‌దీప్‌ని నేను ఆరాధించాను. అంతమంచి స్త్రీ నా అదృష్టంవల్లే లభించిందని మురిసిపోయేవాణ్ని. కాని, 'రావ్ అండ్ చారి'కంపెనీ మేనేజర్, నా స్నేహాన్ని కోరుతూ నా ఇంటికి రాకపోకలు సాగించడం నా కోసం కాక, నా భార్య కొరకని, ఇందులో నేను ఇరుక్కున్న తర్వాత తెలిసింది. ఆ తర్వాత ఆ మేనేజర్ నాకీ దొంగతనం అంటగట్టాడు. నేను నా కంఠనాళాలు చిరిగిపోయేటట్లుగా 'నేనీ దొంగతనం చేయలేద'ని అరిచాను. నేను, ప్రాణపదంగా ప్రేమించిన నా భార్యే నా వద్ద వంద రూపాయల నోట్లకట్టలు తాను చూసినట్లు చెప్పింది.

దాంతో నాకు రెండేళ్ళ జైలు శిక్ష విధించబడింది."

నేను కొన్ని క్షణాలు మౌనం వహించాను. గత మూడు న్నర సంవత్సరముల జీవితం నా కళ్ళముందు ఫిల్మ్ రీల్ లా కదలసాగింది.

"ఆ తర్వాత నా శిక్షాకాలం కేవలం ఆర్నెల్లు వుందనగా జైలులో మంటలు అంటుకోవడంలాంటి సంఘటన ఏర్పడింది. ఖైదీలకు పారిపోవడానికి అవకాశం లభించింది. అందరితో నేనూ బయటపడ్డాను. పోలీసుల చేతుల్లోంచి బయటకు వచ్చిన తర్వాత వాళ్ళనుండి తప్పించుకోవడానికి, నేను మా కులంలో ఎవరూ చేయగూడని పనిచేశాను. నా గెడ్డం, మీసాలు, జుత్తు తొలగించి నేను చాలా పాపం చేశాను. అప్పటినుండి నా కష్టాలు మరింత ఎక్కువయ్యాయి.

"నేను ఎమ్. కామ్; ఎల్. ఎల్ బి. డిగ్రీ పొందాను. కానీ నేనెవరికి అంత చదువుకున్నానని చెప్పుకోలేను. ఎందు కంటే ఆ డిగ్రీ పొందింది కృపాల్ సింగ్, కాని కృష్ణకుమార్ కాదు. కృష్ణకుమార్ తాను చదువుకున్నానని చెబుతూ ఏ విధమైన సర్టిఫికేట్ చూపించలేడు. అందుకోరకు నేను అడుగు అడుగున ఎదురుదెబ్బలు తిన్నాను. పోస్టాఫీసు ముందు కూర్చుని, అయిదు పైసలకు మనిఆర్డర్ ఫార్మ్లు నింపడం, ఉత్తరాలు రాయడం మొదలు, పాసింజర్ల కొరకు టాక్సీ స్టాండులనుండి టాక్సీలు పట్టుకువచ్చే పనివరకు రకరకాల పనులు చేశాను. అది నా మంచితనమో, లేక నా దురి దృష్టమోకాని, ఇంత ప్రయత్నించిన తర్వాతకూడా నేను ఒక్క పూట కడుపునిండా భోజనం చేయలేకపోయేవాణ్ని. మీరు నాకు ఉద్యోగం ఇచ్చిననాడు, భగవంతుడికి నాయీ కష్టాలు చాలనిపించి ఈ ఉద్యోగం ఇప్పించాడనుకున్నాను కాని, ఇలా తిరిగి వలలో నేను ఇరుక్కోవలసివస్తుందని అను కోలేదు."

"కల్‌దీప్ ఎక్కడుందో, ఏమో నీకు తెలియదా?"

నా పెదవులపై ఒక కుటిల మందహాసం వెలిసింది.

"ఏమో, ఎక్కడుందో?" నేను చెప్పసాగాను. "ఆ మేనేజర్‌తోనే వుందో లేక ఇంకొకర్నెవరినయినా పట్టిందేమో! కాని, మేడమ్! ఇప్పుడు నాకు నా భార్యను గురించిన చింతలేదు. ఆమె నన్ను మోసగించినందుకు బాధపడటం కూడా లేదు. నా యీ జీవితం ఎంత కఠినంగా గడిచిందో, అందులో ఇతరుల తప్పులేదు. తప్పంతా నాది. న్యాయంగా బ్రతికేవాళ్ళకు ఈ ప్రపంచంలో స్థానంలేదు. ఈ ప్రపంచం నమ్మినవాళ్ళను తడిగుడ్డతో గొంతుక కోసే వాళ్ళకే మంచిని చేస్తుంది. నేటి యీ ప్రపంచంలో ఎవరయినా నిన్ను ప్రేమగా కౌగలించుకున్నారంటే, అతను నీపట్ల తన ప్రేమను కాదు వ్యక్తం చేసేది, నీ వీపుని తడిమి ఎక్కడ సులువుగా పొడవవచ్చోనని పరీక్షిస్తున్నాడన్నమాట. నాకు తగిలిన ఎదురు దెబ్బలు చాలాచాలా పాఠాలు నేర్పాయి మేడమ్. ఒకప్పుడు నాకున్న ఆశయాలు ఇప్పుడు నావి కావు. ఇప్పుడు నేను ప్రతివ్యక్తిని నేను దొంగగాను, మోసగాడుగాను అనుకుంటున్నాను. ప్రస్తుతం నా దృష్టిలో ప్రతి స్త్రీకూడా మోసగత్తె, కామినీ పిశాచిని" నేను ఆగిపోయాను.

రాగిణికూడా నిశ్శబ్దం వహించింది. ఉన్నట్లుండి ఆమె కొంచెం విచలితమయినట్లు నాకనిపించింది.

కొన్ని క్షణాల వరకు మా ఇరువురిలో ఎవరూ మాట్లాడలేదు.

ఆ తర్వాత ఆమెలో తిరిగి ముందున్న నిశ్చలమూ, కఠినత్వం చోటుచేసుకుంది.

"నీ లైఫ్‌స్కెచ్ నేను విన్నాను" ఉన్నట్లుండి ఆమె తీక్షణంగా అంది. "ఇప్పుడు నీవు నా ప్రశ్నకు జవాబు

చెప్పు. నేను చెప్పినట్లు చేస్తావా? లేక జైలుకి వెళ్తావా?"

"మీలో చోటుచేసుకున్న యీ దురాలోచనను వదిలేయ లేరా మేడం?" నేను అర్థిస్తున్నట్లుగా అన్నాను. "పెద బాబుగారు యిప్పటికే, ఇప్పుడో,అప్పుడో అనేట్లున్నారు. ఆయన్ని హత్య చేయించి ఎందుకు అనవసరంగా పాపం నెత్తిన చుట్టుకుంటారు. ఎలాగూ నాలుగు సంవత్సరాలు కాచుకున్నవాళ్లు, మరో కొన్నాళ్లు ఆగండి."

"నే నింకా కాచుక్కూచోలేను" రాగిణి,విసుగుతో తీక్ష ణంగా అంది.

"నేను గత నాలుగుసంవత్సరాలుగా యీ పక్షవాయువు రోగి ఖైదులో కుళ్ళిపోతున్నాను. నా కిప్పుడు స్వేచ్ఛ కావాలి. ఈ నాలుగేళ్లుకూడా నేను ప్రతిక్షణం ఆ ముస లాడి చావు గురించి ఎదురు చూశాను. ఆ ముసలాడు తనంత తానుగా ఈ ప్రపంచాన్ని వదిలేట్లు లేడు. అతణ్ని తొల గించే ప్రయత్నం చేయకుంటే మరో యాభయి ఏళ్ళయినా అలా మంచంమీదుగా తీసుకుంటూ బ్రతుకుతాడు. నీవన్నట్లు ఈ యాభయిఏళ్ళు వేచివుంటే ఆ తర్వాత అతని ఈ డబ్బుకి అప్పుడు నా దృష్టిలో ఏ విలువ వుండదు. ఇక నీ ఉప దేశాలు చాలించి నా పని చేస్తావా, లేదా? ఆ విషయం చెప్పు?"

"నో; నేను చేయను" నేను శాంతంగా జవాబిచ్చాను.

"ఏమిటి?" ఆశ్చర్యంతో నా ముఖం చూస్తూ అంది.

"నేను నీవు చెప్పినపని చేయను, అనిఅంటున్నాను" నేను అదే శాంత స్వరంతో అన్నాను.

"మిసెస్ రాగిణీ లాల్‌చంద్! నేను యీ పనిచేయను. నీవు నన్ను బ్లాక్ మెయిల్ చేయలేవు. నన్ను బ్లాక్ మెయిల్ చేయడానికి నీ వద్దనున్న ట్రింప్ కార్డ్స్ అంత బలంగాలేవు. అసహాయుడయిన ఆ వృద్ధుణ్ని చంపి, నిన్ను, నీ లక్ష రూపా

యలు సంపాదించే కంటే జైలుకి వెళ్ళటం నా కిష్టం. నిజం చెప్పాలంటే మేడమ్, నేను జైలునుండి పారిపోయి చాలా తప్పుపని చేశాను. నా శిక్షాకాలం కేవలం ఆర్నెల్లు వుండింది. ఇతర ఖైదీలలాగే నేను పారిపోయి ఎంత పొరపాటు చేశానో నా కిప్పుడు అర్థం అవుతోంది.''

''నేను పారిపోకుండా వుంటే ఇప్పటికి నాశిక్ష పూర్తయి, నేను మళ్ళీ సమాజానికి, ప్రపంచానికి నా నిర్దోషిత్వాన్ని నిరూపించుకుని నా కొరకు ఒక స్థానం సంపాదించుకుని వుండే వాణ్ని. నేను నిరపరాధిని; అయినా జైలునుండి పారిపోయి నేను రెంటికీ చెడ్డ రేవడినయ్యాను. ఒక వేళ ఇప్పుడు నీవు నన్ను పోలీసులకి పట్టిచ్చినా వాళ్లు నన్ను ఉరికంబ మేమీ ఎక్కించరు. జైలునుండి పారిపోయినందుకి శిక్షగా ముందున్న ఆరునెలలకి తోడుగా మరో సంవత్సరమో, లేక రెండు సంవత్సరాలో జైలు శిక్షను విధిస్తారు. ఆ శిక్షను నేను అనుభవించడానికి సిద్ధంగా వున్నాను. జీవితం చాలా పెద్దది. జీవితాంతం ప్రతిఘటించటం కూడా చేతకాని ఆ అసహాయ వృద్ధుణ్ని చంపిన పాపపు బరువుని గుండెలమీద కుంపటిలా పెట్టుకోవడం కంటే అధికారులు విధించే జైలు శిక్షను అనుభవించడం చాలా సులభం. కాని నీవు నన్ను జైలుకి కూడా పంపలేవు. ఒక వేళ నీవు అలాంటి ప్రయత్నం చేస్తే మాత్రం నీ గతి చాలా దుర్గతి అవుతుంది.''

''నాకేమిటి దుర్గతి అయ్యేది?''

''నీవు నాతో నీ భర్తని హత్య చేయించ దలచుకున్నట్లు నేను ప్రపంచ మంతటికి తెలియచేస్తాను. కాళ్లు, చేతులు కూడా కదిలించలేని ఆ ముసలాడి పీడ విరగడ అవుతే, అతని ఆ స్తితో నీవు నీ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించడానికి ప్లాను వేశావని చెబుతాను.''

''వినే వాళ్ళు నీ మాటలు నమ్ముతా రంటావా?''

వ్యంగ్యంగా అందామె.

"చెప్పవలసిన విధంగా చెబితే ఎవరయినా నమ్ముతారు. నేనేమని చెబుతానో తెలుసా. నేను నీ ప్రియుణ్నని, మనిరువురి మధ్య అనుచితమయిన శారీరక సంబంధ ముందని, నీ పెళ్ళికి ముందే, నీవు హైద్రాబాద్‌లో వుంటున్నప్పటి నుండే నీవు నాకు పరిచితురాలివనీ, అప్పుడే మనమధ్య ఈ సంబంధ మేర్పడింది. ఇప్పుడు కూడా వివాహమయిన తర్వాత వృద్ధుడు మంచానపడటంవల్ల తన కామాన్ని తీర్చుకోవడానికి, పూర్వ పరిచితుడనయిన నేనుకనబదేసరికి వుద్యోగం నెపంతో తన ఎస్టేట్‌లో రప్పించుకుందని చెబుతాను. ఇప్పుడు నీవు ఇలా దొంగచాటుగావడంతో విసుగెత్తావు. దానితోపాటు నీకు లాల్‌చంద్ అపారమయిన ఆస్తిపై ఆశకూడా వుంది. అది అతను చనిపోతేకాని పూర్తికాదు."

"డియర్ మేడమ్, ఫార్ యువర్ ఇన్ఫర్మేషన్, నిన్న రాత్రి మన మిద్దరం ఇక్కడ నుండి బంగళా వరకు వెళ్ళినప్పుడు, హౌస్ కీపర్ 'దయామయి' మన ఇరువురిని చూసింది. నిన్న అర్ధరాత్రి తర్వాత నీవు ఇక్కడికి వచ్చిన విషయం దయామయికి తెలుసు. ఆమె ఇచ్చే ఒక్క స్టేట్‌మెంట్ మనిద్దరి మధ్య అనుచితమయిన సంబంధ ముందని తెలుపడానికి చాలనుకుంటాను. ఇవాళ కూడా ఆమె నిన్నటిలాగే మిమ్ములను కవర్ చేస్తుందేమో! ఇవాళ ఆమె ఒక్కర్తే ఉండక పోవచ్చు. ఆమెతోపాటు నర్స్ జూలీ, కావంటే ఈ ఎస్టేట్ యొక్క నమ్మకమయిన మరో నౌకరెవరయినా వుండవచ్చు. తమ యజమానిని మోసగించి, తమ యజమానురాలు ఎలా ప్రవర్తిస్తోందో వారికూ్కడా తెలిసి వస్తుంది."

రాగిణి శిలామూర్తిలా నా ఎదురుగా కూర్చుని వుంది. ఆమె ముఖం బూడిదలా పాలిపోయింది.

"అంతేకాదు;" నేను తిరిగి చెప్పసాగాను. "ఈ విషయా

లన్నీ నేను సర్‌లాల్‌చంద్ గారితో కూడా చెప్పగలను. ఆయన మాట్లాడలేరు, కదలలేరు. రాయలేక పోవచ్చు. కాని ఆయన ఆలోచించగలరు. ఏదో ఉపాయాన్ని ఆలోచించి ఆయన కొత్త వీలునామాని తయారు చేయించవచ్చు, లేదా నీ 'కారెక్టర్'ని గురించి ప్రమాణాలు సిద్ధం చేసుకుని నీకు విడాకులు ఇవ్వవచ్చు... మిసెస్ రాగిణీ లాల్‌చంద్, నీవు నన్నేమని బ్లాక్‌మెయిల్ చేయగలవు. తలచుకుంటే నేనే నిన్ను బ్లాక్‌మెయిల్ చేయగలను. నీవు నా గురించి ఏదైనా ఎవరికయినా చెప్పిన మరుక్షణం నీ గురించి అంతా బయట పడుతుంది. నీవు నోరు మూసుకుని వున్నంతవరకు నా పెదవులకి తాళం ఉంటుంది. ఏమంటావ్?"

"నీవు ఇంత తుచ్ఛుడవని నే ననుకోలేదు?" రాగిణి పాములా బుసకొడుతూ అంది.

"నీ అంత తుచ్ఛుణ్ని మాత్రంకాదు మిసెస్ రాగిణీ లాల్ చంద్!" అన్నాను నేను నవ్వుతూ.

ఆమె నన్ను నిప్పులు కురిసే కళ్ళతో చూడసాగింది.

"మేడమ్; నేనిదివరకే ఒక స్త్రీతో చాలా బాగా దెబ్బ తిన్నాను. ఆ గాయం మానింది కాని, మచ్చ పోలేదు. ఆ మచ్చను చూస్తూ కూడా మళ్ళీ ఒక స్త్రీ వలలో పడేంత మూర్ఖుణ్ని మాత్రంకాదు."

రాగిణి తన స్థానంలోంచి విసురుగా లేచి నిలబడింది.

"ఇంకొక విషయం విని పో" నేను వెంటనే అన్నాను.

ఏమిటన్నట్లుగా ఆమె నన్ను తినేసేట్లుగా చూసింది.

"ఒకవేళ నన్ను ఉద్యోగం లోంచి తీసేయాలనుకుంటు న్నట్లయితే బలమయిన ప్రమాణాన్ని చేరబట్టండి. చిట్టి, చిట్టి ఆరోపణలు పనిచేయవు. అందరూ ఇక్కడ నా పని వల్ల సంతుష్టులయి వున్నారు. నన్నవసరంగా ఉద్యోగం లోంచి తొలగిస్తే ఇతరులకి నీపై సందేహం ఏర్పడుతుంది.

మొదట యూసుఫ్ చేతుల్లోంచి సర్ లాల్ చంద్ క్రింద పడుతూకూడా తప్పించుకోగలిగారు. రెండవసారి కూడా నాతో కూడా అలాగే జరిగింది. ఇప్పుడు నీవు తీసుకు వచ్చే మూడవ మనిషివల్ల ఒకవేళ కాకతాళీయంగానే అటువంటి దేదయినా జరిగినా నిన్ను అందరూ అనుమానిస్తారు. ప్రస్తుతం నీ పొజిషన్ చాలా డెలికేట్ గా వుంది. అందుకని ఆయన్ని తొలగించాలనే ఆలోచనను మానేసి, ఆయన్ని త్వరగా తన వద్దకు పిలిపించుకోమని దేవుణ్ని ప్రార్థించు. అందులోనే నీ మంచి వుంది."

రాగిణి నన్ను నోటితో ఒక్క మాట కూడా అనలేదు. కాని ఆమె చూసిన చూపుకిగాని ఏ మాత్రం శక్తి వున్నా నేనక్కడే భస్మం అయి వుండేవాణ్ని. అలా చూసిన ఆమె వెనక్కి తిరిగి గబగబా బయటికి వెళ్ళిపోయింది.

2

రెండవరోజు సుమారు పదకొండు గంటలయింది. అప్పటికి సర్ లాల్ చంద్ తన బ్రేక్ ఫాస్ట్ పూర్తిచేసి మంచంపై పడుకున్న పొజిషన్ లోనే వెనక్కి చేరగిలబడి విశ్రాంతి తీసుకుంటున్నారు. అప్పుడే రాగిణి వచ్చి నన్ను గారేజ్ లోంచి కారు తీయమని ఆదేశించింది.

నేను గ్యారేజ్ లోంచి రాగిణికి ఇష్టమయిన బేబి ఆస్టిన్ కారుని తీసి పోర్టికోలో తెచ్చి ఆపాను.

నేను ఒక సిగరెట్ వెలిగించుకుని పోర్టికో స్తంభానికి ఆనుకుని దమ్ముపై దమ్ము లాగుతున్నాను. బహుశా రాగిణి నన్ను కారు డ్రయివ్ చేయమనవచ్చని నేను అక్కడే ఆగాను.

ఉదయంనుండి ఇప్పటి వరకు 'దయామయి' నాకు చాలా సార్లు ఎదురయింది. ఆమె ప్రతిసారికూడా సాధారణంగానే

వ్యవహరించింది. ఆమె యొక్క ఏ ప్రవర్తన వల్లగాని, మాటలవల్లకాని, రాత్రి రాగిణి నా గదిలోకి వచ్చినవిషయం తనకు తెలిసినట్లు ప్రకటింపచేయలేదు. ఒకవేళ ఆమె రాగిణి నా క్వార్టర్లోకి రావడం చూసివుంటే తప్పకుండా ఆ విషయమై ఏమయినా అడిగివుండేది.

అప్పుడే రాగిణి బయటకు వచ్చింది.

ఆ సమయంలో ఆమె డార్క్ రెడ్ కలర్లో డిజైన్ లున్న బాంబెడైయింగ్ శారీ, అదేరంగు బ్లౌజు వేసుకుంది. పెద్దపెద్ద అద్దాలున్న 'గోగో' సన్ గ్లాసెస్ పెట్టుకుంది.

ఆమె నావైపు చూడనయినా చూడకుండా నేరుగా వెళ్ళి కారు డ్రయివింగ్ సీట్లో కూర్చుంది. మరుక్షణం ఆమె కారు స్టార్ట్ చేసి గియర్ మార్చి, కారుని ముందుకి దూకించింది.

కొన్ని క్షణాలవరకు నేను అక్కడే వుదాసీనంగా నిలుచున్నాను. ఉన్నట్లుండి నాకో ఆలోచన తట్టింది. నేను సిగరెట్ పారవేసి తిరిగి గారేజ్ వైపుకి పరుగెత్తాను. షెవర్లే ఇంపాలా ఆగివున్న గారేజ్ తెరిచి కారుని బయటకు తీసి తిరిగి గారేజ్ మూశాను. తిరిగి ఇంపాలాలో కూర్చుంటూనే కారు స్టార్ట్ చేసి గేటువైపుకి పోనిచ్చాను.

సర్ లాల్ చంద్ వద్దనున్న నాలుగు కార్ల తాళంచెవులు ఎప్పుడు నావద్దనే వుంటాయి. అయినా వాటిని ఎప్పుడు వుపయోగించలేదు. రాత్రి రాగిణితో జరిగిన వాదవివాదాల వల్ల ఒకవేళ ఆమె పోలీసులకి నాగురించి రిపోర్ట్ చేయడానికే వెళ్ళిందేమోనని భయంపట్టుకుంది. అందుకే ఆమెను వెంబడించాలన్న ఆలోచన కలిగింది.

కొద్దిసేపటిలోనే నాకు రాగిణి నడుపుతున్న ఆస్టిన్ కనిపించింది.

నేను జాగ్రత్తగా ఆమె కారుని వెంబడించసాగాను.

రాగిణి మాహీమ్ వైపుకి పోతూంది.

ఇప్పటికి నా మనస్సు కాస్త కుదుటపడింది. ఆమె పోలీస్ స్టేషన్‌కి వెళ్ళడంలేదు. ఆమె పోలీస్ స్టేషన్‌కి వెళ్ళదలచుకుంటే శాంతాక్రజ్, అంధేరీ, బాంద్రా మొదలయిన పోలీస్ స్టేషన్లలో ఎక్కడికయినా వెళ్ళివుండేది.

మరింత వుత్సాహంతో నేనామెను వెంబడించసాగాను.

మాహీమ్ దాటాము. మాటుంగా దాటింది. దాదర్ కూడా పోయింది. మా రెండుకార్లు శేకబ్ సర్కిల్ ఏరియాలోకి ప్రవేశించాయి.

ఉన్నట్లుండి రాగిణి తన కారుని మహాలక్ష్మి బ్రిడ్జ్ వైపు తిప్పింది. మహాలక్ష్మి బ్రిడ్జికి సమీపంలో ఒకచోట ఆమె కారుని ఆపి కారులోంచి బయటకు వచ్చింది.

నేను నా కారుని దూరంగా రోడ్డుకి వారగా ఆపాను. నేను కారులోంచి క్రిందికి దిగలేదు. డ్రయివింగ్ సీట్‌లో కూర్చునే నేను ఆమె ప్రతి కదలికను గమనించసాగాను.

రాగిణి బ్రిడ్జి ప్రక్కగావున్న గుడిసెలవైపుకి వెళ్ళింది. మలుపువద్ద ఆమెకు ఒక చిన్న కుర్రాడు కనిపించాడు. ఆమె తన పర్స్‌లోంచి ఒక నాణెంతీసి కుర్రాడికి ఇస్తూ ఏదో చెప్పింది.

కుర్రాడు సరే అన్నట్లుగా తలూపి ఆ గుడిసెల్లోకి పరుగెత్తాడు. కొద్ది సేపటిలోనే ఒక వ్యక్తి రాగిణివైపు వస్తూ కనిపించాడు. అతనిపై తన చూపు పడగానే రాగిణి వెనక్కి తిరిగి కారువైపు నడిచింది.

నేనొచ్చిన రెండవరోజుననే తన లెక్క పూర్తిగా తేలలేదంటూ దయామయితో వాదులాడిపోయిన యూసుఫ్ అతను. రాగిణి తిరిగి వచ్చి తన కారులో కూర్చుంది. ఆమె చేసిన సైగతో యూసుఫ్ కూడా ఆమె ప్రక్కన కూర్చున్నాడు.

కారులో కూర్చునే వాళ్ళిరువురూ ఏదో మాట్లాడుకుంటు

న్నారు. నాకు యూసుఫ్ అవును, కాదు అన్నట్లుగా తలూపడం కనిపిస్తోంది. సుమారు పదినిముషాల తర్వాత యూసుఫ్ కారులోంచి క్రిందికి దిగాడు. అతను రాగిణికి అభివాదం చేసి తిరిగి గుడిసెలవైపుకి సాగిపోయాడు.

రాగిణి కారుని స్టార్ట్ చేసింది. ఆమె కారుని బాక్ చేయ సాగింది.

నా కారు ఆమె కారుకి చాలా వెనుకగావుంది. నేను కూడా కారుని బాక్ చేసి వెనక్కి తిప్పాను. రాగిణి ఇంకా తన కారుని బాక్ చేస్తూనేవుంది. అప్పటికే నా కారుగాలితో పందెం వేయసాగింది.

రాగిణి, యూసుఫ్‌ని కలవడం, నాకెందుకో ఒక పెద్ద దుర్ఘటన జరగనున్నదనిపించింది. అయితే అది ఎలాంటి అపాయమయి వుంటుదన్నదిమాత్రం నాకు అర్థంకాలేదు.

నేను తిరిగి లాల్‌చంద్ ఎస్టేట్‌లోకి చేరుకున్నాను. నేను ఇంపాలాను గారేజ్‌లో పెట్టి నా క్వార్టర్‌లోకి చేరుకున్నాను. సుమారు పావుగంట తర్వాత రాగిణికారు ఎస్టేట్‌లోకి ప్రవేశించింది. కారుని గారేజ్‌లో పెట్టడానికి రాగిణి నన్ను పిలుస్తుందేమో అనుకున్నాను.

కాని ఆమె నన్ను పిలవలేదు.

కారు పోర్టికోలోనే నిలబడివుంది.

3

సాయంత్రం టీ తర్వాత సుమారు రెండుగంటల వరకు నేను సర్ లాల్‌చంద్‌కి ఆయన కిష్టమయిన నవల చదివి వినిపించాను.

రాత్రి ఎనిమిదిగంటల ప్రాంతంలో నర్స్ జూలీ ఆయనకు మితంగా భోజనం చేయించింది. ఆ తర్వాత నే నాయన్ను వీల్‌చెయిర్ నుండి మంచంపైకి చేర్చాను.

సుమారు ఎనిమిదిన్నర ప్రాంతంలో రాగిణి నన్ను పిలిపించింది.

"నర్స్ జూలీ కొలాబా వెళ్ళాలి" ఆమె చెప్పసాగింది. "నా ఆస్టిన్ పోర్టికోలో వుంది. నీవు నర్స్‌ని కొలాబాలో వదిలి రావాలి."

"రైట్ మేడమ్!" నేను నమ్రతగా అన్నాను.

నర్స్ జూలీ నావెంట బయలుదేరింది.

ఆమె కారులో కూర్చోగానే నేను కారుని కొలాబా వైపుకి పోనిచ్చాను.

"మిమ్మల్ని తిరిగి తీసుకురావడానికి నేనక్కడ ఎంతసేపు ఎదురు చూడాల్సివుంటుంది మేడమ్?" నేను నర్స్‌ని అడిగాను.

"నీవు నాకోరకు ఎదురు చూడాల్సిన అవసరంలేదు. నీవు నన్ను వదిలి తిరిగి వచ్చేయవచ్చు. నే నీరాత్రి అక్కడే వుంటాను. మా అమ్మగారి ఆరోగ్యం బాగాలేదు. రేపు ఉదయం నేనే తిరిగి వచ్చేస్తాను" నర్స్ జూలీ అంది.

"ఓహ్!" నే నేదో ఆలోచిస్తూ అన్నాను. "అయితే ఈ రాత్రికి మీరు లేకుండా బాబుగారిని ఎవరు చూస్తుంటారు?" అడిగాను.

"సాధారణంగా యీ భారాన్ని 'దయామయి' తీసుకుంటుంది, కాని ఇవాళ 'రాగిణి' చూసుకోవాలి."

"ఎందుకు?" నేను అనుమానంగా అడిగాను.

"దయామయికి కూడా వంట్లో బాగుండలేదు. ఆమెకు కీళ్ళనొప్పులున్నాయి. ఆ బాధ తాళలేకుండావుంటే నే నామెకు సెడెటివ్ డ్రగ్ ఇచ్చాను. ఆమె తన గదిలో మత్తుగా నిద్రపోతూండవచ్చు."

నా చెవుల్లో డేంజర్ అలార్మ్ మ్రోగసాగింది. సర్ లాల్ ట్‌లో ఒక్కడే రాగిణి రక్షణలో వున్నాడు.

ఇవాళ వుదయం రాగిణి 'యూసుఫ్'ని కలిసి రహస్యంగా ఏదో మాట్లాడివచ్చింది.

తప్పకుండా ఏదో గందరగోళముంది.

ఒకవేళ రాగిణి కావలసే యీ అవకాశాన్ని వుపయోగించదలుచుకుని యూసుఫ్‌తో మాట్లాడి వచ్చిందా?

నాగుండె వేగంగా కొట్టుకోసాగింది. సర్ లాల్‌చంద్ ఏకాంతంగా రాగిణితో వుండడం, తప్పకుండా ఏదో గడబిడ జరుగుతుందని నా మనస్సు హెచ్చరించింది.

నా కళ్ళముందు ఉండి ఉండి రాగిణి ముఖం, యూసుఫ్ ముఖం కదలాడసాగింది.

కొలాబా, సర్ లాల్‌చంద్ ఎస్టేట్ నుండి ఎంతలేదన్నా పదిహేను మైళ్ళ దూరం వుంది. ట్రాఫిక్‌తో నిండివుండే బొంబాయిరోడ్లపై ఎంత వేగంగా కారు నడపాలన్నా కేవలం రాకపోకలకు ఒక గంటకు పైగా పడుతుంది.

ఈ గంటకాలంలో రాగిణి, యూసుఫ్ లిరువురుగాని, లేక రాగిణి ఒక్కర్తేగాని ఏంచేస్తుందో ఎవరికి తెలుసు.

నేను మనస్సులోనే ఒక నిశ్చయానికి వచ్చాను. కారుని కొంతదూరం పోనిచ్చి ఒకచోట ఆపాను.

"ఏమయింది?" జూలీ అడిగింది.

"ఇంజన్‌లో ఏదో మిస్టేక్ వున్నట్లుంది,ఇప్పుడేచూస్తాను" అంటూ కారుదిగి బోనెట్ తెరిచి ఇంజన్ పరీక్ష చేస్తున్నట్లు నటించాను.

జూలీ ఆదుర్దాగా నాకేసి చూస్తోంది. సుమారు అయిదు నిముషాల తర్వాత నేను ఇంజన్‌లోంచి తలఎత్తాను.

"ఇంజన్ రిపేర్ కావడానికి ఎంతసేపు పడుతుందో తెలియదు. అసలు మిస్టేక్ ఏమిటో నాకింకా అర్థంకాలేదు. మీరు టాక్సీలో వెళ్ళిపోవడం మంచిదనుకుంటాను" నేను జూలీతో చెప్పాను.

"ఆల్ రైట్" అందామె.

నేనో టాక్సీ ఆపి జూలీని అందులో ఎక్కించాను.

టాక్సీ నా దృష్టిపథంనుండి తప్పుకోగానే నేనుబోనెట్ వేసి తిరిగి వచ్చి డ్రయివింగ్ సీట్ లో కూర్చున్నాను.

మరుక్షణం నాకారు లాల్ చంద్ ఎస్టేట్ వైపు దూసుకు పోసాగింది.

అయిదు నిముషాల్లో నేను ఎస్టేట్ చేరుకున్నాను.

కారుని ఎస్టేట్ లోకి పోనీయక కొద్దిదూరంలో ఫుట్ పాత్ కి ఆనించి ఆపాను. కారుదిగి చుట్టు తిరిగి నేను ఎస్టేట్ కి వెనుక వైపుకి చేరుకున్నాను.

వెనుక సముద్రపు అలల ఘోష తప్ప ఇంకేవిధమయిన శబ్దం లేదు.

సర్ లాల్ చంద్ రూం కిటికీలు వెనుక సముద్రపువైపు తెరుచుకుంటాయి.

నేను నిశ్శబ్దంగా పిల్లిలా అడుగులు వేసుకుంటూ వెళ్ళి ఒక కిటికీ చాటున నిలబడ్డాను.

"మైడియర్ హాస్బెండ్" లోపలినుండి నాకు రాగిణి యొక్క విషమిళితమయిన కంఠస్వరం వినిపించింది. "నీకు నవలలు, కథలు వినే అలవాటుంది కదూ! ఇవాళ నేను ఒక కథ వినిపిస్తాను. కాని ఈ కథ వినిపించడానికి నేను ఏ నవలా చదవాల్సిన అవసరంలేదు.అంతేకాదు ఆ కథలోని ముఖ్యమయిన పాత్రవు నీవే అని తెలిసినప్పుడు నీవు సంతోషిస్తావుకూడా!"

నేను రాతిబొమ్మలా అక్కడ నిలబడి లోపలినుండి విని పించే ఒక్కొక్క శబ్దాన్ని వినసాగాను.

"స్వీట్ హార్ట్" రాగిణి చెప్పసాగింది. "నన్ను యీ ముసలివయస్సులో పెళ్ళిచేసుకుని, నీవెంతగా పశ్చాత్తాప పడ్డావో అంతకు పదిరెట్లు నేను నిన్ను చేసుకున్నందుకు

పశ్చాత్తాపపడ్డాను. నీవు చెప్పినట్లల్లా విని, ప్రతినిత్యము నీ పాద ధూళిని శిరస్సున ధరించే పతివ్రత లభించింది అని నీవనుకున్నావు, కాని అలా కాలేదు. నీ కలాంటి భార్య దొరకలేదు. నిన్ను నీ యీ ముసలితనంలో వివాహం చేసుకుని, నీవద్ద మూల్గుతున్న ధనంతో ప్రపంచంలోని అనందాన్ని కొనుక్కోవచ్చని నేను ఆశించాను, కాని అలా కాలేదు. నాకలాంటి భర్త లభించలేదు.

"పాతచింతకాయ పచ్చడిలాంటి నీ పాత భావాలతో నీవు నన్ను అనుక్షణం అనుమానించావు. నే నే యువకుని వైపు కన్నెత్తి చూసినా నీగుండె పగిలిపోయేది. వయస్సులో అందంగా వున్న నీ భార్యను ఎవడయినా ఎగరేసుకుపోతాడేమోననినీవునన్ను సొసైటిలోతిరగకుండా అంక్షవిధించావు. నీవు ఎప్పుడయినా ఎక్కడికయినా తీసికెళ్ళావంటే అక్కడ కూడా నీలా ముసలాళ్ళు, వాళ్ళ ముసలిభార్యలుండే పార్టీలకు తీసికెళ్ళావు. నీవు వీలయివుంటే నీ లక్షల ఆస్తిని బాంక్ లాకర్లలో దాచినట్టు నన్నుకూడా ఏ లాకర్ లోనో దాచి, నా అవసరం వచ్చినప్పుడే బయటకు తీసేవాడివి.

"నేనే ఆ స్తిని ఆశించి నిన్ను పెళ్ళిచేసుకున్నానో, ఆ ఆస్తి వాసనకూడా నావరకు రాకుండా చేశావు నీవు. నిన్ను పెళ్ళిచేసుకున్న తర్వాత, నీ మొత్తం ఆస్తి కాకపోయినా అందులో కొంత భాగమయినా నీ చేతిలో వుంటుందని కలలు కన్నాను. ఇటు నేను నీ ఆస్తిని పీల్చాలని ప్లాను శేస్తున్నాను. నీవేమో నా రక్తాన్ని పీల్చడం మొదలు పెట్టావు. నీవు పూర్తిగా నన్ను నీ పిడికిలిలో బంధించాలని చూశావు. అయినా నే నేదో విధంగా సర్దుకు నేదానిని. కాని నీవు వీలునామానికూడా మార్చుకున్నావని తెలిసింది."

లోపలినుండి రాగిణి మాటలు ఆగిపోయాయి. ఆస్థానంలో

ఆమె బరువుగా వూపిరి పీల్చి వదులుతున్న చప్పుడు వినిపించసాగింది.

లోపలినుండి వచ్చే ప్రతిశబ్దంకూడా స్పష్టంగా నా శ్రవణేంద్రియాల్లోకి దూరుతూంది.

"మన వివాహానికి ముందు నీవో వీలునామా వ్రాశావు. ఆ వీలునామా ప్రకారం, నీ మరణం తర్వాత నీ యీ యావదాస్తి నాకూ, నీ మొదటి భార్య కూతురు సవితకు చెరిసగం చెందాలని వ్రాశావు. కాని మన పెళ్ళయిన సంవత్సరం లోపునే నీవు నాకు పూర్తిగా విరుద్ధమయ్యావు. అంతేకాదు, ఆ వీలునికూడా మార్చాలనుకున్నావు. ఇవాళ కాకుంటే రేపైనా నీ మరణం తర్వాత నా భాగంలో లభించే లక్షల ఆస్తిపై ఆశ పెట్టుకునే నేను నీతో కాపురం చేస్తున్నాను. కాని, నీవు నా ఆ ఆశను కూడాపూర్తి కాకుండా చూడాలనుకున్నావు. నా భవిష్యత్తు అంధకారంగా కనిపించసాగింది. ఆ అంధకారంనుండి తప్పుకోవడానికి నే నేమయినా వెంటనే చేయాలనుకున్నాను, చేశాను కూడా! ఏమిటి డియర్ కథ ఇంట్రెస్టింగ్ గా వుందా సస్పెన్స్ మంచి గ్రిప్ గావుందా?"

లోపల కొన్ని క్షణాలు నిశ్శబ్దం చోటుచేసుకుంది. ఆ తర్వాత రాగిణి తిరిగి చెప్పసాగింది. "ఇప్పుడీ కథలోని అత్యంత ఉత్తేజిత పూరితమయిన సంఘటనను విను డియర్! నీవు ఆ వీలునామాను మార్చేలోగానే నేను నిన్ను ఈ ప్రపంచంనుండి తప్పించాలనుకున్నాను. అర్థమయిందా నే నేమి చేయాలనుకున్నానో? నిన్ను హత్య చేయాలనుకున్నాను... వాట్? వులిక్కిపడ్డావు కదూ డియర్?

"నీ ముఖం చూస్తుంటే యీ విషయమై నీ వెప్పుడూ ఆలోచించలేదని తెలుస్తూంది. ఏ కారు ఆక్సిడెంట్ వల్ల

నీవీనాడు ఈ దుస్థితిలో వున్నావో ఆ స్థితి నా వల్ల జరిగింది. నేను బ్రేక్ ఆయిల్ టాంక్‌లో రంధ్రం చేసి, నీ కారు బ్రేకులు పనిచేయకుండా చేశాను. నీకు స్పీడుగా కారు నడిపే అలవాటుందని నాకు తెలుసు. బ్రేకులు పనిచేయక పోవటంవల్ల నీ కారుకి ఆక్సిడెంటు జరుగుతుందని దాంతో నీ పని ఆఖరు అని నేను దృఢంగా నమ్మాను. కాని నా దురదృష్టం...!"

"అంతటి భయంకరమయిన ఆక్సిడెంట్ తర్వాత కూడా నీ ప్రాణాలు పోలేదు. కేవలం పక్షవాయువు రోగివి అయి నోటిమాట కూడా పోగొట్టుకున్నావు. తర్వాత నేననుకున్నట్లు పోలీసులు కూడా ఇది ఒక ఆక్సిడెంట్ గానే కేసుని క్లోజ్ చేశారు. మిస్టర్ లాల్‌చంద్; నీవు చనిపోలేదు. నిజమే కాని, ఇప్పుడు నీవు నాకు చెందనున్న నీ ఆస్తి విషయంలో ఏమీ చేసే స్థితిలో కూడా లేవు. ఆ రోజు తర్వాత నుండి నేను ప్రతి దినము, ప్రతి క్షణం నీ చావు గురించి ఎదురు చూడసాగాను. ఆక్సిడెంట్ జరిగిన ప్రారంభపు రోజుల్లో ఇవాళో, రేపో అనేట్లుగా వున్నావు... కాని; టు మై బాడ్ లక్ నాలుగేళ్ళు గడిచినా మృత్యువు కూడా నీ వద్దకు రావడానికి భయపడుతోంది."

"ఇంకా చావుతో పోరాడుతూ ఉజ్వలం కానున్న నా భవిష్యత్తుపై తిరిగి కాటుక పులమాలని అనుకుంటున్నావు నీవు. యీ నాలుగేళ్లుగా నీ చావు కెదురు చూస్తూ నే నోడి పోయాను. కాని, నీవు చావుతో పోరాడుతూ కూడా ఓడి పోలేదు. ఇప్పుడు నిన్ను ఇక్కడి నుండి బలవంతంగా పంపించకుంటే నీవు మరో నూరేళ్ళయినా బ్రతుకుతావనిపిస్తుంది. కాని నీ చావు యీసారి అంత సులభంగా వుండదు. ఈసారి నీవు ఏలాంటి చావు చస్తావో తెలుసా? హే! భగవాన్! నేనింతకు ముందే ఎందుకు చనిపోలేదా అని గుండెలవిసి పోయేట్లుగా కుళ్ళి, కుళ్ళి చస్తావు. సర్ లాల్‌చంద్ ఇది

నా ప్రతీకారం నీకు శిక్ష..."

తిరిగి గదిలో నిశ్శబ్దం అలుముకుంది. రాగిణి బహుశా గా వు తేజితురాలయి నట్లుంది. బరువయిన ఊపిరి శబ్దం బయటివరకు స్పష్టంగా వినిపిస్తోంది.

"రేపు నీ ముద్దుల కూతురు సబిత తన దసరా శెలవులు గడపడానికి వస్తుంది." రాగిణి శాంతంగా చెప్పసాగింది. "వచ్చే శనివారం దసరా! వచ్చే శనివారం దయామయితో సహా ఇంట్లోని నౌకర్లందరికి శెలవు ఉంటుంది. నర్స్ జూలీ ఈ శనివారం తనకు రెండు రోజులు శెలవు కావాలని, డాక్టర్‌ని అడిగింది. అతనామెకు శెలవు మంజూరు చేశాడు కూడా! ఆనాడు ఈ బంగళాలో, నీతోపాటు, నేను, సబిత, కృష్ణకుమార్ మాత్రమే ఉంటాం. ఆ రాత్రి సబిత తన గదిలో చచ్చి పడివుంటుంది. ఆమె శరీరంపై ఒక గుడ్డ ముక్కా డా వుండదు. పోలీసుల పరిశోధనలో ఎవరో బలవంతంగా సబితను చెరచి, గొంతుక పిసికి చంపారని తేలుతుంది. సబితను బలాత్కారంగా చెరచి, ఆమెను చంపే బాధ్యత నీ పాత నౌకరు యూసుఫ్ చూసుకుంటాడు. నే నతనికి అందులో సహాయం చేస్తాను. కాని ఆ రెండు అపరాధాలు మాత్రం కృష్ణకుమార్ పై తోయబడతాయి."

వింటున్న నా ఒళ్ళు ఒక్కసారిగా "ఝుల్లు" మంది. గుండె వేగంగా కొట్టుకోసాగింది.

"పోలీసులకి ఫోన్ చేసి నేను పిలిపిస్తాను. సబిత గదిలో నే నేదో శబ్దం విన్నానని, ఆ తర్వాత ఆ గది కిటికీలోంచి కృష్ణకుమార్ దూకి పరుగెత్తటం చూశాను. నేను సబిత ఒంటిపై నూలుపోగు లేకుండా చచ్చి పడివుందని చెబుతాను. నీకో విషయం చెబుతున్నాను విను, కృష్ణకుమార్ జైలులోంచి పారిపోయిన అపరాధి. ఆ విషయం పోలీసులకు తెలిసిన మరుక్షణం నా మాటలు వారు పూర్తిగా విశ్వసిస్తారు."

సభ్యుడయిన నేను ఆమె మాటలను వింటున్నాను.

"మై డియర్ పతిదేవ్!" రాగిణి మెత్తని కత్తిలాంటి పదునుతో చెప్పుకుపోతూంది.

"ఇప్పుడు నేను చెప్పిందంతా కేవలం నిన్ను భయపెట్ట డానికి చెబుతున్నానని మాత్రం అనుకోవద్దు. ఇంత వరకు నేను చెప్పిందంతా జరుగుతుంది. వచ్చే శనివారం, నీ ముద్దుల కూతురు సబిత భయంకరంగా హత్యచేయబడుతుంది. ఒక వేళ డాక్టరు గుప్త నీ గుండె బలహీనతను గురించి చెప్పిందే నిజమయితే; నీ కూతురు బలాత్కారము, ఆమె బీభత్స మయిన చావు కబురు వినగానే నీ గుండె ఆగిపోతుందని నాకు నమ్మకముంది. ఒక వేళ యీ సారి కూడా నీ గుండె ఆగడాన్ని నేను అపుతాను నీ ముఖంపై దిండుని పెట్టి కేవలం అర నిముషం అదిమి వుంచానంటే చాలు ఈ ప్రపం చంతో నీ సంబంధం పూర్తవుతుంది. కూతురు మరణ వార్త విని, తండ్రి కూడా గుండె ఆగి కూతురుని చేరుకున్నాడనే అందరూ అనుకుంటారు. ఆ తర్వాత యావదాస్తికి నేను ఏకైక వారసురాలిని అవుతాను. ప్చ్! ఏ ఆస్తినయితే నా చేతికి అందకుండా చేయాలనుకున్నావో ఆ ఆస్తంతటికి నేను అధికారిణి అవుతాను..."

"నా... మై డియర్! నేనేమి చెప్పానో దాని గురించి ఆలోచించు. రాబోయే శనివారం నీ కూతురికి పట్టబోయే సితికి తలచుకుంటూ కుళ్ళి కుళ్ళి ఏడువు. ఆమె ఎంతటి నరక యాతనను అనుభవించ బోతూందో ఆలోచిస్తూ ఆ నరక యాతనలో నీవు మాడిపో; నీవు నీ స్థానం నుండి కదల్లేవు. నీవు మాట్లాడలేవు కూడా, అందుకని నీవు నా స్కీమ్‌ః ఇతరులకి చెప్పలేవు కూడా! నీవు నీ కూతురిని హెచ్చరించ లేవు."

"వచ్చే శనివారం, నర్స్ జూలీ రెండు రోజుల శెలవుపై

ఎస్టేట్ నుండి బయట పడుతుంది. ఇతర నౌకర్లందరూ, దసరా ఉత్సవాల్లో పేల్గొనడానికి సెలవు తీసుకుని బయటకు వెళ్ళిపోతుంటే అసహాయంగా చూస్తుండటం మినహా నీవేమీ చేయలేవు. కేవలం కృష్ణకుమార్ మాత్రమే బంగళాలో వుంటాడు. ఆనాడు అతను బయటకు ఎక్కడికి వెళ్ళకుండా నేను చూసుకుంటాను. యూసుఫ్ వస్తాడని, నీ కూతురిని చెరచి, చంపుతాడని నీకు తెలసింది, అయినా నీవు ఏమీ చేయలేవు.''

''సర్ లాల్ చంద్ ఈ తొమ్మిది రోజులు నీ ముఖాన్ని చూస్తూ నే నెంతగా సంతోషిస్తానో చెప్పలేను. నీవు విలవిల్లాడుతుంటావు, ఏడుస్తుంటావు. నీ కూతురు భవిష్యత్తుని తలచుకుంటూ ఆమెకు రాబోయే గతిని తలచుకుంటూ నీ గుండె చిల్లులు పడిపోతుంది. కాని ఏమీ చేయలేని దయనీయ స్థితి నీది. నీవీ నరకాగ్నిలో మలమల మాడాలనే తొమ్మిది రోజులు ముందుగా నా స్కీముని నీకు చెప్పాను. ఇదే నీ శిక్ష, నా ప్రతీకారం కూడా!'' రాగిణి తన హీల్స్ని టకటక లాడిస్తూ వెళ్ళిపోయింది. గదంతా భయంకరమయిన శబ్దం అలుముకుంది.

కొద్దిక్షణాల తర్వాత నేను కొద్దిగా తలనువంచి తొంగి చూశాను. మంచంపై స్పందనరహితమయిన లాల్ చంద్ శరీరం పడివుంది. ప్రక్కనున్న జాలీగదితలుపు తెరిచివుంది. కాని నా కక్కడ రాగిణి కనిపించలేదు.

నేను కిటికీ ప్రక్కనుండి కదిలి చుట్టు తిరిగి కారుని ఆపినచోటుకి చేరుకున్నాను. కారు డ్రయివింగ్ సీటులో కూర్చుని, సిగరెట్ వెలిగించి ఆలోచించసాగాను.

చాలా సంకటమయిన పరిస్థితి ఏర్పడింది.... కేవలం నా ఒక్కడికేకాదు, సర్ లాల్ చంద్, సబితలక్కూడా సంకట పరిస్థితే! నన్ను గురించిన చింత నాకులేదు. రాగిణి స్కీముని గురించి నాకు తెలిసిపోయింది. కాబట్టి పరిస్థితినుండి నేను

ఏదో విధంగా చేతులు దులుపుకోగలను. వచ్చే శనివారం వరకు మాట అటుంచి నేను రేపే, సబిత ఇక్కడికి రాక ముందే నేను యీ ఎస్టేటుని, వీలయితే బొంబాయినుండే దూరంగా వెళ్ళిపోగలను.

కాని, నేను పారిపోయినంత మాత్రాన లాల్‌చంద్, సబితలు చావునుండి తప్పుకోగలరా?

ఊహూ!

నేను లేకున్నా కూడా రాగిణి తన స్కీముని సమర్థవంతంగా పూర్తి చేసుకోగలదు. ఆ ధైర్యం ఆమెకు వుంది. యూసుఫ్ సబితను చెరచి చంపిన తర్వాత ఆమె అతణ్ని తుపాకితో కాల్చి చంపవచ్చు. యూసుఫ్, సబితను చంపి పారిపోతుండగా తాను చూశాననీ, అతణ్ని ఆపడానికి వేరు మార్గం తోచక కాల్చి చంపానని ఆమె పోలీసులతో చెప్పవచ్చు. లేక అలాంటిదే మరో అయిడియా ఏదైనా వేయవచ్చు.

రాగిణిలాంటి దిగజారిన ఆడది తన ఇష్టం వచ్చినట్లు చేయదలచుకుంటే ఆమె నెవరూ ఆపలేరు.

నేనే ఏమయినా చేయాలి... స్టీరింగ్ వీల్‌ని పిడికిలి బిగించి గుద్దుతూ గొణుక్కున్నాను.

కాని నేనేం చేయగలను...

నేను విన్న విషయాలను పోలీసులకుగాని, డాక్టర్ గుప్తాకుగాని, ఇంకొకరికిగాని చెప్పలేను. చెబితే నాకు మొదటినుండే రాగిణిపై అనుమానం వుండిందని, అందుకే ఇంజన్ పాడయిన నెపంతో నర్సుని టాక్సీలో పంపి వెనక్కి తిరిగి వచ్చానని చెప్పాల్సి వస్తుంది. రాగిణిపై నా కెందుకు అనుమానం కలిగింది అన్నదానికి నేను సరయిన సమాధానం చెప్పలేను.

చెబితే నేను జైలునుండి పరారయిన ఖైదీనని కూడా తెలిసి

పోతుంది. నేను జైలుకి వెళ్ళడానికి సిద్ధంగా వున్నానని రాగిణితో చెప్పటం వేరు. కేవలం ఆమెను బెదిరించడానికే ఆ మాట అన్నాను కాని వాస్తవానికి నా కా అభిప్రాయం లేదు.

అదీకాక నేను - అంటే పరారయిన ఖైదీ చెప్పేమాటలు నిజమేనని పోలీస్ నమ్ముతుందని గ్యారంటీ ఏముంది? రాగిణి నా దృష్టిలో దిగజారిపోయిన నీచురాలు. కాని సమాజం దృష్టిలో మానమర్యాదలతో వైభవంగా వెలుగొందుతున్న మహిళ. కోట్లకు అధిపతి అయిన సర్ లాల్ చంద్ కి భార్య.

నేను చెబుతున్నది అబద్దం అని నిరూపించడానికి రాగిణికి అంత కష్టమనిపించదు. అంతేకాక రాగిణికి, తన హావభావాలను, యవ్వనాన్ని, అందాన్ని ట్రంప్ కార్డులుగా వుపయోగించటం బాగా తెలుసు.

నేను పోలీసులవరకు వెళితే అందులో నాకే నష్టం కలుగుతుంది. తిరిగి నేను జైలులో వుంటాను.

సర్ లాల్ చంద్ నికాని, సబితనుకాని రాగిణి చేసిన ఈ స్కీములో బలికాకుండా చూడాలనుకున్నాను.

ఎలా? ఉన్నట్లుండి నా మెదడులో ఒక మెరుపు మెరిసింది.

రాగిణి లాల్ చంద్ నుగాని, సబితనుగాని చంపకముందే నే నామెను చంపితే?

రాగిణిలాంటి అపాయకరమైన స్త్రీ మోసగత్తెకు అసలు బ్రతికే హక్కు లేదు. రాగిణి మరణంవల్ల సబిత యొక్క అమాయిక ప్రాణం బ్రతుకుతుంది.

రాగిణి మరణంవల్ల నేను మళ్ళీ జైలు కెళ్ళకుండా తప్పించుకోగలను. నేను జైలునుండి పారిపోయినప్పటినుండి నన్ను పరారయిన ఖైదీగ గుర్తించిన మొదటివ్యక్తి ఆమే! ఆమెను చంపితే?

ఇప్పుడు నేను, రాగిణిని చంపినా ఎవరికి నాపై అను

మానం కలగకుండా చూడాలి. అలాంటి ప్లాను వేయాలి.

నేను సిగరెట్ పారవేసి కార్యస్టార్ట్ చేశాను.

4

ఆ రెండవరోజు వుదయం పదిగంటలకు నర్స్ జూలీ తిరిగి వచ్చింది. పదిఅయిదు నిముషాలకు ఆమె లాల్ చంద్ వద్దకు వెళ్ళింది. ఆ తర్వాత రెండు నిముషాలకు ఆమె డాక్టర్ గుప్తాకు ఫోన్ చేసింది.

డాక్టర్ గుప్తా తన పనంతా వదిలి షెరింజన్ లా పరుగెత్తుకు వచ్చాడు.

అతను రాగానే సర్ లాల్ చంద్ గదిలోకి వెళ్ళాడు. గదిలోకి వెళ్ళిన అతను నర్స్ జూలీని, రాగిణిని గది బయటకు పంపి లోపలనుండి తలుపులు మూసుకున్నాడు.

బాబుగారికి ఏమో జరిగింది. ఈ విషయం నిముషాల్లో ఎస్టేట్ అంతా వ్యాపించింది. నేనూ, దయామయి కూడా ఆయనగారి బెడ్ రూం బయట వరండాలోకి చేరుకున్నాం. రాగిణి, నర్స్ జూలీలు మొదటినుండీ అక్కడ వున్నారు. మిగిలిన నౌకర్లెవరూ అక్కడివరకు రాకుండా కట్టుదిట్టం చేయబడింది.

సుమారు పదిహేను నిముషాల తర్వాత గుప్తాగారు బయటకు వచ్చారు. ఆయన చాలా గంభీరంగా వున్నాడు. అతను పరిశీలనగా మా అందరిని గుచ్చి, గుచ్చి చూడసాగాడు. ఆ తర్వాత అతను కఠినంగా అడిగాడు "ఏం జరిగింది?" అతని కంఠంలో అధికారంకూడా పొడసూపింది.

ఎవరూ ఏమీ చెప్పలేదు. ఆయనకూడా ప్రశ్న ఏ ఒక్కరిని వుద్దేశించి అడగలేదు. మేం మందరము ఒకరి మొఖాలు ఒకరు చూసుకున్నాం.

"అసలు విషయం ఏమిటి డాక్టర్?" కొద్దిసేపటి తర్వాత రాగిణి అడిగింది.

"సర్ లాల్‌చంద్ వున్నట్లుండి తీవ్రంగా కొలాప్స్ అయ్యారు" డాక్టర్ గంభీరంగా చెప్పసాగాడు. "నిన్న వుదయం ఆయన పరిస్థితి ఎంతో మెరుగ్గా వుంది. ఇవాళ ఆయన ఎంతగా భయభీతులు, ఉత్తేజితులు అయివున్నా రంటే ఆయన భూతాన్ని చూశానేమో అన్నట్లుగా వున్నారు. నిన్నటికి, నేటికి మధ్య ఏదో అప్రియమైన సంఘటన జరిగింది. ఆ సంఘటనవల్ల ఆయన చాలా కంగారు పడుతున్నారు. ఆయన్ను చూస్తుంటే ఆయన ఎదురుచూడనిదేదో జరిగినట్లు తోస్తుంది. ఆయన..."

"వాట్ డాక్టర్" రాగిణి అదుర్దాగా అంది. "ఇదెలా సంభవము. నిన్న నర్స్ లేకపోవడంవల్ల నేనే ఆయనవద్ద వున్నాను. నిన్న ఆయన మూడ్‌లో ఏ విధమయిన పరివర్తన నాకు కనిపించలేదు. నర్స్ జూలీ తిరిగి వచ్చేవరకు, ఆయన వద్దకు నేనుతప్ప మరోవ్యక్తి వెళ్ళలేదు."

"ఆయనలో ఏ విధమయిన పరివర్తన మీకు కనిపించ లేదా?"

"ఆయన కాస్త ఉత్తేజితులయివున్నట్లుమాత్రం తోచింది. అదీగాక ఆయన అలా వుత్తేజితులు కావడం స్వాభావికమే అనుకున్నాను. ఇవాళ ఆరునెలల తర్వాత సబిత తన కాలేజి నుండి ఇంటికి వస్తుంది. కూతురుని కలుసుకోబోయే సంతోషంలో ఆయన వుత్తేజితులయి వున్నారనుకున్నాను."

"కేవలం ఉత్తేజితులు కావడంకాదు, బాగా ఆందోళన పడుతున్నారాయన. భయంవల్ల ఆయన నేత్రాలు వెళ్ళుకు వస్తున్నాయి, ప్రతిక్షణంకూడా, ఆయన ఏదో చేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తోస్తోంది. ఆయన పల్స్ తీవ్ర మయింది. ఆయన గుండెల్లో తుఫానువీస్తోంది. సబిత ఇంతకు ముందుకూడా శెలవులకు వచ్చింది. కాని ఆయన ఎప్పుడూ ఇంతగా ఉద్రిక్తులవలేదు."

"అయితే ఏం జరిగిందో భగవంతునికే తెలియాలి" రాగిణి విచారంగా అంది.

"మీ కెవరికయినా, ఏమయినా తెలుసా?" డాక్టర్ గుప్తా మమ్మలను అడిగాడు.

మాలో ఎవరూ జవాబివ్వలేదు.

"ఆల్ రైట్" డాక్టర్ ఒక నిమిషం తర్వాత అన్నాడు. "నే నాయనకు ఇంజెక్షన్ యిచ్చాను. ఇప్పుడాయన పడుకుని వున్నారు. ఆయన కే విధమయిన డిస్టర్బ కలగకుండా చూడండి. నర్స్ ఈ బాధ్యత నీపైవుంది. నీకు ఆయన పరిస్థితి శోచనీయంగా తోస్తే నాకు వెంటనే ఫోన్ చేయి. ఆయన పరిస్థితిలో మెరుగు కనిపించేవరకు నేను ఇక్కడికి ప్రతిరోజూ వస్తాను. నేనో క్రొత్త ప్రిస్క్రిప్షన్ తయారు చేశాను. మందులు, ఇంజక్షన్లు తెప్పించుకో. ఒకవేళ యీ వారంలో ఆయన మెరుగు కాకపోతే, జూలీ నీ లీవు కాన్సిల్; తెలిసిందా?" ఆయన చెప్పాడు.

నర్స్ సరే అన్నట్లుగా మెల్లిగా తలూపింది.

రాగిణి కళ్ళలో కంగారు కనిపించింది. కాని ఆ కంగారుని, నేను తప్ప ఇంకెవరూ అర్థం చేసుకోలేదు. జూలీ లీవు కాన్సిల్ అయిందంటే ఆమె సిద్ధంచేసిన స్కీమంతా పనికిరాకుండా పోతుంది. రాగిణి మంచి నటీమణి కూడా! తన ఆందోళనను ఆమె లాల్‌చంద్ ప్రస్తుత పరిస్థితిలోవున్న స్థితినిబట్టి వ్యక్తం చేసింది.

"డాక్టర్" రాగిణి విచారంగా అడిగింది. "అంత ప్రమాదమేమీ లేదుకదా?"

"ఇప్పటివరకు పరిస్థితి కంట్రోలులోనే వుంది. కాని ప్రస్తుతం ఆయన పరిస్థితినిబట్టి ఏం జరిగినా అసంభవమేమీ కాదు."

"బహుశా, సవిత రావడంవల్ల ఆయన ఆరోగ్యంలో

ఎయినా మార్పు రావచ్చంటారా?"

"ఆ నమ్మకముంది! కాని అసలు జరిగిందేమిటో నాకు అర్థంకావడంలేదు. ఉన్నట్లుండి ఆయన ఎందుకింత ఆందోళన పడుతున్నారు? ఏదో విపరీతమయిన చింత ఆయన్ని లోలోపలే తినేస్తున్నట్లు తోస్తోంది. ఇంతకుముందు ఆయన, ఏదో చెప్పాలని ఇంత తీవ్రంగా ప్రయత్నం చేయడం నేను చూల్లేదు. ఆయన చెప్పదలచుకున్న దేమిటో నాకు తెలిస్తే లేక ఆయన చెప్పగలిగితే?"

డాక్టర్ గుప్తా ఒకసారి దీర్ఘంగా నిశ్వసించి ఆగిపోయాడు. ఆ తర్వాత నర్స్‌ని తనతో రమ్మని సైగచేసి తిరిగి బెడ్ రూంలోకి వెళ్ళాడతను.

రాగిణికూడా బెడ్ రూంవైపు అడుగు వేసింది కాని, అంతలోనే ఏదో ఆలోచించి ఆగిపోయింది.

సుమారు అయిదు నిముషాల తర్వాత డాక్టర్ వెళ్ళిపోయాడు.

డాక్టర్ వెళ్ళిపోయిన తర్వాత రాగిణి బెడ్ రూంలోకి ప్రవేశించింది, కాని ఆమె ఎక్కువసేపు వుండలేదు. వెంటనే తన గదిలోకి వెళ్ళిపోయింది.

నర్స్ జూలీ బెడ్ రూం తలుపులన్నీ లోపలినుండి మూసింది.

సాయంత్రం నాలుగు గంటలకు రాగిణి నన్ను తీసుకుని ఏర్‌పోర్ట్‌కి వెళ్ళింది.

సబిత ప్లేన్ దిగింది.

సబితను చూడగానే రాగిణి పరుగున వెళ్ళి ఆప్యాయంగా కౌగిలించుకుంది. రాగిణి చూపించే ఆప్యాయతను చూస్తుంటే సబిత ఆమెకు సవతికూతురుకాక స్వంతకూతురా అనిపించేలా వుంది. సబితను హత్య చేయించాలనుకున్న తన స్కీముని మార్పులేదుకదా అనిపించింది నాకే!

సబిత పదహారు వసంతాలను చూచిన, ఒక అందమయిన

అమాయిక బాలిక. ఆమెను చూచిన తర్వాత, శనివారం నాడు రాత్రి యూసుఫ్ ఆమెతో ప్రవర్తించబోయే స్థితిని, గురించి తలచుకుంటే నాకే గుండె బరువుగావుంది. మరి ఆ తండ్రి ఎంతగా బాధపడుతున్నాడో?

అమాయికమయిన సబిత ముఖం చూచిన తర్వాత రాగిణిని చంపాలన్న సంకల్పం నాలో మరింత ధృఢమయింది.

ఆ ఇరువురూ వచ్చి కారులో కూర్చున్నారు. వారిని నేను ఎస్టేట్ కి తీసుకువచ్చాను.

సబిత నేరుగా తండ్రి గదిలోకి వెళ్ళింది.

సబితను చూసింతర్వాత సర్ లాల్ చంద్ లో ఏవిధమయిన పరివర్తనలు కలిగాయి అన్న విషయం గమనించే అవకాశం నాకు కలుగలేదు.

5

ఆరురోజులు నిర్విఘ్నంగా గడిచిపోయాయి.

ఈ ఆరురోజులు డాక్టర్ ప్రతిరోజూ వచ్చాడు.

గురువారంనాటి సాయంత్రం ఆయన సర్ లాల్ చంద్ పరిస్థితి కాస్త మెరుగు అయిందని చెప్పడమేకాక, అనుకున్న ప్రోగ్రాం ప్రకారం నర్స్ జూలీ లీవ్ తీసుకోవచ్చని చెప్పాడు.

ఆ రాత్రి రాగిణి కళ్ళలో ఒక విధమయిన పైశాచికమైన మెరుపుని నేను గమనించాను.

ఈలోపల రాగిణి తప్పకుండా ఒకసారి యూసుఫ్ ని కలుస్తుందని నాకెందుకో నమ్మకంగా వుంది. ఈ ఆరు రోజులుకూడా నేను ప్రతిక్షణం రాగిణిని అంటిపెట్టుకునే వున్నాను.

ఆరాత్రి పదకొండు గంటల ప్రాంతంలో రాగిణి నిశ్శబ్దంగా బయటకు రావడం నేను చూశాను. ఆమె శరీరంపై

కేవలం ఒక సిల్క్ నైట్ గౌన్ మాత్రమేవుంది. ఆమె తన గది కిటికీలోంచి బయటకు వచ్చింది.

ఆమె కిటికీలోంచి బయటకు రావడం నేను వార్డ్రోబ్ నుండి బయటకు వస్తూ చూశాను. ఆమె ఇలా బయటకు వస్తుందని నేను అనుకోలేదు.

రాగిణి కిటికీలోంచి బయటకుదూకి, బంగళా ప్రక్క నుండి వెనుక సముద్రంవైపు సాగింది.

నేనూ నిశ్శబ్దంగా ఆమెను వెంబడించసాగాను.

బంగళా వెనుకవైపు సముద్రానికి దగ్గరగా ఒక చిన్న కాబిన్ వుంది. అందులో ఫిషింగ్ సామాను, స్విమ్మింగ్ దుస్తులు, వున్నాయి. ఒకవిధంగా అది రెస్ట్‌హౌస్‌లా వుపయోగపడుతుంది.

రాగిణి కాబిన్ తలుపు తెరచి లోపలకు ప్రవేశించింది. ఆమె కిటికీలకు, తలుపులకున్న కర్టెన్లను సరిచేసి లైటు వెలిగించింది.

కాబిన్ బంగళానుండి కొంచెందూరంలో వుండటమే కాకుండా చెట్లగుంపు మధ్యనవుంది. అందువల్ల బంగళా నుండి, కాబిన్‌నిగాని, అందులోని వెలుగునికాని చూడడం కష్టం. కర్టెన్స్ వేయటంవల్ల అతి తక్కువ వెలుగు బయటకు ప్రసరిస్తూంది.

నేను పిల్లిలా అడుగులువేస్తూ కాబిన్‌సైడ్‌కి చేరుకుని, చెక్కగోడకు ఆనుకుని నిలబడ్డాను. కాబిన్ యొక్క సముద్రంవైపున్న కిటికీ తెరిచేవుంది. అక్కడ కర్టెన్ కూడా తొలగించబడివుంది.

కొద్దిసేపటి తర్వాత నేను సముద్రంలో తెడ్డువేస్తున్న శబ్దం విన్నాను. చూస్తుండగానే ఒక చిన్న చేపలుపట్టే పడవ ఒడ్డున ఆగింది. అందులోంచి ఒకవ్యక్తి క్రిందికి

అతను 'యూసుఫ్.'

నేను గాలి పీల్చటంకూడా మరచిపోయి ఎదురుచూస్తున్నాను.

అతను క్రిందికిదిగి పడవను బలంగా ఇసుకలోకి లాగి కాబిన్ వైపు సాగాడు.

నేరుగా అతను తలుపువైపుకి వెళ్ళకుండా తెరిచివున్న కిటికీవైపు వచ్చి లోపలకు తొంగిచూశాడు. మందమయిన పసుపురంగు లైట్ వెలుగు అతని ముఖంపైబడి అతనిముఖం భయంకరంగా కనిపించింది నాకు.

అతను తలుపువైపు సాగాడు.

అతను తొంగిచూడటం రాగిణి గమనించినట్లుంది. అతను తలుపువద్దకు వెళ్ళేసరికి తలుపు తెరుచుకుంది. యూసుఫ్ లోపలకు వెళ్ళగానే తలుపులు మూసుకున్నాయి. మరో నిముషం తర్వాత తెరిచివున్న ఆ కిటికీకూడా మూసుకుంది.

నేను వెంటనే ఆ కిటికీవద్దకు వెళ్ళాను.

లోపలి వెలుగు బయటకు ఏమాత్రం ప్రసరించటంలేదు. కిటికీ కర్టెన్ లాగబడటంవల్ల, కిటికీకున్న సందుల్లోంచి లోపలకు చూచినా ఏమీ కనిపించటంలేదు.

నేను కిటికీకి చెవులానించి నిలబడ్డాను.

"థాంక్ గాడ్; టైముకే వచ్చావు. ఆలస్యం చేస్తావేమో ననుకున్నాను" లోపలినుండి రాగిణి కంఠం వినిపించింది.

"శనివారంనాటి ప్రోగ్రాంలో మార్పేమీలేదు" రాగిణి తిరిగి చెప్పసాగింది. "నేనిక్కడే ఈ కాబిన్లో నీ కొరకు ఎదురుచూస్తుంటాను. సముద్రంవైపునుండి వచ్చేటప్పుడు, ఇవాళ్టి లాగే ఈ కిటికీలోంచి లైటువెలుగు కనిపిస్తే లైన్ క్లియర్ గా వుందనుకుని నీవు ఇక్కడికిరా. ఒకవేళ లైటు వెలగకుంటేమాత్రం ఎస్టేట్ వైపు కన్నెత్తికూడా చూడకు.

తెలిసిందా? ఇక్కడ లైటు వెలగకుంటే బంగాళాలో ఏదో గందరగోళం జరిగిందనుకో..."

"మంచిది" యూసుఫ్ అన్నాడు.

"ఒకవేళ లైటు వెలుగుతూంటేమాత్రం సరిగ్గాపదకొండు న్నరకంతా ఇక్కడికి వచ్చెయ్. నేను నీకిక్కడే కలుస్తాను. టైం విషయంలోమాత్రం పొరపాటు చేయకు."

"అచ్ఛా; అచ్ఛా!"

"చేతులకు గ్లవుస్ తొడుక్కోవడం మరచిపోవద్దు. మరో విషయం. సబిత అరవకుండా చూడు. ఒకవేళ అరచినా ఫరవాలేదనుకో, మొత్తం బంగళాలో ఎవరూ వుండరు. మిస్టర్ లాల్‌చంద్, సబిత అరుపులన్నీ విన్నా కదలలేడు కనుక ఏమీ చేయలేడు. ఆమె అరుపు కృష్ణకుమార్ క్వార్టర్ వరకు వినిపించదు. అయినా నీ జాగ్రత్తలోనే వుండటం మంచిది."

"ఆ విషయం చూసుకుంటాను. సబిత పని పూర్తి చెయ్యటం చిటికలో అయిపోతుంది."

"రైట్; ఇక నీవు వెళ్ళు. ఎల్లుండి రాత్రి పదకొండు న్నరకి రా!"

"ఈ కాబిన్‌లో లైటు వెలిగితేనే..."

"శబాష్."

ఆ తర్వాత కాబిన్‌లోంచి మాటలు వినిపించటంలేదు. నేను అక్కడనుండి నిష్క్రమించాను.

6

ఆ రోజు శనివారం సాయంత్రం ఎస్టేట్‌లోని మొత్తం స్టాఫ్ దసరా వుత్సవాలు చూడడానికి వెళ్ళిపోయారు. నర్స్ జూలీకూడా సబితకి సర్‌లాల్‌చంద్‌కి ఇవ్వాల్సిన మందుల విషయం బోధపరిచి వెళ్ళిపోయింది.

చీకటిపడే సమయానికి ఆ ఎస్టేట్‌లో నేనూ, రాగిణి,

సబిత, సర్ లాల్ చంద్ ఈ నలుగురమే మిగిలిపోయాము.

రాత్రి ఎనిమిదిన్నరకి సబిత నన్ను వెళ్ళిపొమ్మని, తను ఒక నవల అందుకుని తండ్రిపక్కగా కూర్చుంది.

నేను నా క్వార్టర్ లోకి వచ్చాను.

పది గంటలకంతా బంగళాలోని లైట్లన్నీ ఆరిపోయాయి.

నేను నా బెడ్ పై పడుకుని ఒక మాగజైన్ చదవటం మొదలు పెట్టాను. నా మంచాన్ని నేను కిటికీ పక్కగా జరిపాను. దానివల్ల బయటి నుండి చూసే వాళ్ళకు నేను గదిలోనే వున్న విషయం స్పష్టమౌతుంది. నేను నామ మాత్రంగా పత్రికను చేత్తో పట్టుకున్నానే కాని నా దృష్టంతా బయటే వుంది.

సుమారు అర్ధగంట తర్వాత నాకు నా క్వార్టర్ కు కొద్ది దూరంలో వున్న పొదలవద్ద ఒక స్త్రీ ఆకారం కనిపించింది. కొద్దిసేపు ఆ ఆకారం అక్కడే నిలబడి తర్వాత బంగళా వైపు సాగింది. ఆమె నడకను బట్టే ఆమె రాగిణి అని చెప్ప గలను. నేను నా క్వార్టర్ లోనే వున్నానో, లేదో చూడ్డా నికి వచ్చిందామె.

ఆమె లోపలకు వెళ్ళగానే నేను మ్యాగజైన్ విసిరి ఎదురు చూడసాగాను.

దూరంగా ఎక్కడో గడియారం పదకొండు గంటలు కొట్టింది. నేను నా క్వార్టర్ లోని లైటు ఆర్పాను.

నేను, బయటకు వచ్చి కాబిన్ వైపు నడిచాను.

కాబిన్ లో ఇంకా చీకటిగానే వుంది.

నేనో చోట చెట్టుక్రింద నిలబడి చేతులకు గ్లవుస్ తొడి గాను. నా పాంటు కుడి జేబులో ఇసుకనింపి కట్టిన సంచి. రెండవ జేబులో నేను దొంగిలించి తెచ్చిన రాగిణి ముత్యాల హారం వుంది. నేను ఓపిగ్గా ఎదురు చూస్తూ నిలబడ్డాను.

సుమారు పది నిముషాల తర్వాత రాగిణి కాబిన్ వైపు

వెల్తూ కనిపించింది.

నేను జాగరూకుడనై వూపిరి బిగపట్టి నిలబడ్డాను.

రాగిణి తలుపు వద్దకు వెళ్ళి తలుపు తెరచి లోపలకు ప్రవేశించింది. నేను నిశ్శబ్దంగా ముందుకు సాగి కాబిన్‌కి ఆనుకుని నిలబడ్డాను. లోపల లైటు వెలిగింది, మొన్నటిలాగే సముద్రపు కిటికీ తప్ప మిగిలిన కిటికీలన్నీ మూసేవున్నాయి.

నేను నా స్థానంలో కదలకుండా నిలబడ్డాను.

నలువైపులా భయంకర నిశ్శబ్దం అలుముకుని వుంది.

నా అనుమానం ప్రకారం పదకొండు ఇరవయి అయి వుంటుందనుకున్న తర్వాత నా స్థానంలోంచి కదిలి కాబిన్ ప్రవేశ ద్వారం వైపుకి సాగాను.

నేను నెమ్మదిగా తలుపుని నెట్టాను.

తలుపు తెరుచుకుంది.

"యూసుఫ్" రాగిణి మెల్లగా గుసగుస లాడుతున్నట్లుగా అంది.

నేను కర్టన్ తొలగించుకుని లోపలకు ప్రవేశించాను.

నన్ను చూడగానే రాగిణి భూతాన్ని చూసి వులికి పడ్డట్లుగా వులికి పడింది. ఆమె నోటినుండి మాట పెకలటం లేదు. కళ్ళు విస్ఫారితమయ్యాయి. "నీవా?" అంది చివరకు.

నన్ను చూసి ఆమె భయపడటం సహజమే. ఏ క్షణంలో నయినా యూసుఫ్ అక్కడికి రావచ్చు. నన్ను అక్కడ చూసి అతను ఆమెను అనుమానించ వచ్చు.

"పదకొండున్నర అయిపోయినా మీరింకా రాలేదు మేడమ్! నాకు కాబిన్‌లో లైటు కనిపించి ఒకవేళ మీరు కాని ఇక్కడ వున్నారేమోనని వచ్చాను," నేను అతి సహజంగా అన్నాను.

నన్ను చూసిన కంగారులో ఆమెకు నా క్వార్టర్ నుండి

కాబిన్ లైటు కనిపించదన్న విషయం కూడా జ్ఞాపకం రాలేదు.

ఆమె కంగారుగా తలుపు వేపు చూడసాగింది.

"నో, నో," ఆమె కంగారుగా అంది. "నీవు నీ క్వార్టర్ లోకి వెళ్ళు. నేను అక్కడికే వస్తాను."

"బట్, మేడమ్! నేనే ఇక్కడికి వచ్చిన తర్వాత... మళ్ళీ..."

"నేను చెప్పాను కదా! నీవు వెళ్లు."

"ఇంతకీ విషయమేమిటి మేడమ్! మీరెందుకింతగా భయపడుతున్నారు?" అడిగాను.

ఆమె నాకు జవాబివ్వలేదు. ఒకసారి తన వాచికేసి చూసుకుని కంగారుగా స్విచ్ బోర్డు వైపు సాగుతూ "పద! నేను నీతో వస్తాను" అంది.

కాబిన్‌లో చీకటిగా వుంటే యూసుఫ్ రాకూడదని ఆదేశించింది. కాబిన్‌లో లైటు ఆర్పి యూసుఫ్‌ని రాకుండా చేయాలనుకుంది ఆమె.

ఆమె వీపు నా వైపు కాగానే నేను టేబిల్ పైనుండి వీనస్ ప్రతిమను అందుకున్నాను. దానిని బలంగా నా చేత్తో పట్టుకుని, చేతిని పైకి లేపాను.

అప్పుడే రాగిణి ఎందుకో వెనక్కి తిరిగింది.

ఆమె నా చేతిలో వీనస్ ప్రతిమని, పైకి లేచిన చేతిని చూసింది. నా చేతులకున్న గ్లవుస్, నా కళ్ళలో ఆమెకు మృత్యువు కనిపించి వుండాలి. తక్షణమే తనకేగతి పట్టనుందో ఆమె అర్థం చేసుకుంది.

భయంవల్ల నేత్రాలు వెళ్ళుకు వచ్చాయి. తనని రక్షించుకోవడానికి రెండు చేతులు ముందుకు చాస్తూ అరవడానికి నోరు తెరిచింది కాని, ఆమె గొంతుక లోంచి శబ్దం బయటకు రావడానికి ముందే వీనస్ ప్రతిమను పట్టుకున్న నా చేయి మెరుపులా క్రిందికి జరిగింది. ఆ బరువయిన ప్రతిమ రాగిణి

తలను ముద్దుపెట్టుకుంది.

రాగిణి తల పగిలింది. ప్రతిమవల్ల అయిన గాయంలోంచి రక్తం పిచికారిలోంచి ఎగజిమ్మినట్లు చిమ్మింది. తడబడుతూ నా కాళ్ళ వద్ద పడింది.

ఆమె ప్రాణాలు పోయాయి.

నేను నెత్తుటితో తడిసిన ఆ ప్రతిమను అలాగే పట్టుకుని వణుకుతూ నిలబడ్డాను.

అనుకోకుండానే నా దృష్టి కిటికీలోంచి బయటపడింది. దూరంగా సముద్రంలో ఒక దోనె వస్తూంది.

యూసుఫ్ వస్తున్నాడు.

నేను వీనస్ ప్రతిమను రాగిణి శవంవద్ద పారేసి వేగంగా బయటకు వచ్చాను. నేను కాబిన్ తలుపులు చేరవేసి సముద్రం వైపు నడిచాను. యూసుఫ్ ఇంకా దూరంలోనే వున్నాడు. అనుకోకుండానే నా చేతులు జేబులో దూరి ఇసుక సంచిని బలంగా పట్టుకున్నాయి. దానితో అతని మెడమీద బాది చంపి, ముత్యాల హారం అతని జేబులోపెట్టి, అతనిని, దోనెను నీళ్ళలో ముంచెయ్యాలని నా ప్లాను. చూచిన వాళ్లు అతనే రాగిణిని చంపి ముత్యాల హారం దొంగిలించాడంటారు.

నేను మెల్లగా చెట్లగుంపు మధ్యగా ముందుకు పోతున్నాను.

అంతలో "కృష్ణకుమార్!" అని ఎవరో పిలవడంతో నేను ఉలిక్కిపడ్డాను.

నా రక్తం గడ్డ కట్టింది. ఇంకొక్క అడుగు ముందుకు వేసినా నేను లోతైన లోయలోకి దిగజారి పోతానే అన్నట్లుగా తక్కిన ఆగిపోయాను.

7

చెట్టు చాటునుండి ఒక ఆకారం నా వైపుకి రాసాగింది. అతిసున్నితమయిన ఆ స్థితిలో మరో వ్యక్తిని అక్కడ

చూచి నా గుండెలు గుబగుబ లాడుతున్నాయి.

"కృష్ణకుమార్!"

ఈసారి నేనా ఆకారపు కంఠంతో పాటు అతని ముఖాన్ని కూడా పోల్చుకో గలిగాను.

ఆ ఆకారం డాక్టర్ గుప్తాది.

"ఆఁ!" నేను మెల్లగా అన్నాను.

"నీవు ఇక్కడ ఏం చేస్తున్నావు?" అతను నాతో అన్నాడు. కాని నా జవాబు గురించి ఎదురుచూడ లేదతను. అతను నా జబ్బ పట్టుకుని చెట్టుచాటుకి లాగాడు.

"ఇప్పుడిక్కడికి యూసుఫ్ వస్తాడు. నీవు అతనికి కని పించే ఉంటే అంతా సర్వనాశనమయి వుండేది... అయినా నీవు ఇక్కడికి ఎందుకు వచ్చావ్?"

"నేను... నేను... నాకు నిద్రరాలేదు. మనస్సంతా బరువుగా...వుంది. అందుకని చల్లగాలికి సముద్రం వైపు వచ్చాను" తడబడుతూ చెప్పాను.

"నీవు కాబిన్ వద్ద నుండి వెళ్ళావా?"

"ఆఁ!"

"లోపలకు వెళ్ళలేదా?"

"లేదు, ఎందుకు?"

"కాబిన్‌లో లైటు వెలుగుతోంది. అయినా నీకు అనుమానం కలగలేదా?"

"కలిగింది" నేను మెల్లిగా అన్నాను.

"అయినా లోపల ఎవరున్నారో చూడాలనిపించలేదా?"

"లేదు. నేను చెప్పాను కదా! నా మనస్సు బాగుండు లేదని. అందుకని ఆ విషయం నేను పట్టించుకో లేదు."

"మంచి పని చేశావు. లేకుంటే రాగిణిని హెచ్చరించి నట్లయ్యేది."

"రాగిణీ!"

"అవును, కాబిన్‌లో రాగిణి వుంది."

"ఈజిట్?"

"హాఁ! ఆ తుచ్ఛురాలు ఏం చేయాలనుకుంటోందో నీకు తెలుసా?"

"ఏం చేయాలనుకుంటోంది?" నేను అడగడమయితే అడిగానుకాని, నాలో నిలబడే శక్తి క్షీణించినట్లు అనిపించసాగింది.

"రాగిణి; యూసుఫ్ లిరువురూ కలిసి సబితను హత్య చేయనున్నారు. రాగిణి కాబిన్‌లో కూర్చుని యూసుఫ్ గురించి ఎదురుచూస్తూండవచ్చు. అతను ఏ క్షణంలోనయినా ఇక్కడికి రావచ్చు. వాళ్ళను బంధించడానికి నేనో వల పన్నాను. ఫర్ యువర్ ఇన్ఫర్మేషన్, ఈ ఇంటిని పోలీసులు చుట్టుముట్టి వున్నారు."

నేనేమీ చెప్పలేదు. మాట్లాడే స్థితిలో లేనుకూడా! ఇప్పుడో అప్పుడో గుండె కొట్టుకోవడం ఆగిపోతుందేమోననిపిస్తోంది.

"సర్ లాల్‌చంద్ మోటార్‌కార్ ఆక్సిడెంట్‌కి కారకురాలు రాగిణి అని చెబితే నీవు ఆశ్చర్యపోవచ్చు" డాక్టర్ గుప్తా చెప్పుకుపోసాగాడు. "ఆ ఆడది, ఆయన కారు బ్రేకులు పనిచేయకుండా చేసింది. దాంతో ఆయన మరణిస్తే వీలునామా మార్చరని, పాత వీలునామావరకు సగం ఆస్తిని హస్తగతం చేసుకోవచ్చని ఆశించింది. కాని ఆయన మరణించలేదు. కేవలం పారాలిసిస్ అటాక్ అయింది.

"ఇన్నాళ్ళు ఆమెకి అతని చావు గురించి ఎదురుచూసి విసుగెత్తినట్లయింది. ఇవాళ యూసుఫ్‌తో కలిసి కొత్తఎత్తు వేసింది. మొదలు యూసుఫ్ సబితను బలాత్కారం చేసిన తర్వాత ఆమెను హత్యచేస్తాడు. ఆ విషయం వినగానే సర్ లాల్‌చంద్ హార్ట్‌ఫేల్ అవుతుంది. ఒకవేళ కాకున్నా,

వారాయన్ని చంపి, అది కేవలం కూతురు విషయంవిని గుండె ఆగి మరణించినట్లు నిరూపించదలిచారు. వాళ్ళు యీ స్కీములో సఫలీకృతులయితే నీవు ఇరుక్కుంటావు. సవితను చెరిచి ఆమెను చంపింది నీవేనని వాళ్లు పోలీసులకు తెలుప దలచుకున్నారు."

"కాని... కాని... డాక్టర్ మీ కిదంతా ఎలా తెలుసు?" నేను నా గొంతుక తడారిపోతుండగా అడిగాను.

"సర్ లాల్ చంద్ ని మానసికంగా బాధపెట్టాలని రాగిణి తన యీ స్కీముని గురించి ముందే ఆయనకు తెలిపింది. ఆయన కదల్లేరని, మాట్లాడలేరని ఆమె అంత ధైర్యంగా చెప్ప గలిగింది. కాని అసలు జరిగిందేమిటంటే రాగిణి మాటలు ఆయనను బాగా దెబ్బతీసాయి. ఆయన గుండెకు బలమయిన గాయం కలిగింది. అంతటి స్థితిని ఆయన ఎలా ఓర్చుకో గలిగారో నాకే ఆశ్చర్యంగా వుంది. తన కూతురుకి కలుగబోయే ఆపదను గురించి అందరికి తెలియచేయాలని ఆయన ఎంతగా వ్యాకులపడ్డారంటే, ఆ వ్యాకులమే ఆయనకు మాట వచ్చేటట్లు చేసింది.

"రాగిణి ఈ విషయం ఆయనకు చెప్పినప్పటినుండి, తన కూతురుని రక్షించుకోవడానికి, తానేమయినా చేయాలని, లేకుంటే తన కూతురు అమానుషంగా చంపబడుతుందన్న భావనవల్ల ఏదో చెప్పడానికి, ఆయన చాలా వ్యాకుల పడ్డారు. విపరీతమయిన శ్రమవల్ల, తన కూతురు క్షేమం ఆయన్ని మాట్లాడేటట్లు చేసింది. ఆయన మొన్న మొత్తం విషయాన్ని నాకు వివరించారు. నే నా విషయం పోలీసులకి తెలిపాను. తత్ఫలితమే ఇవాళ పోలీసులు యింటిని చుట్టుముట్టి వున్నారు. వాళ్ళు, ఆ ఇద్దరిని రెడ్ హేండెడ్ గా పట్టుకోవడానికి ఎదురు చూస్తున్నారు."

ఓహ్ గాడ్!...నిస్సహాయంగా నిలబడిపోయాను నేను

తొందరపడి నేను అనవసరంగా రాగిణిని చంపి, ఆ హత్యాప రాధాన్ని తలపైకి తెచ్చుకున్నాను. నే నేమీ చేయకున్నా రాగిణి పట్టుబడేదే! నా తరఫున నే నో మంచి చేయబోయి, నన్ను నేను సర్వనాశనం చేసుకున్నాను. యూసుఫ్‌ని పోలీసులు అరెస్ట్ చేస్తే రాగిణి హత్యాపరాధాన్ని నే నతనిపై ఎలా తోయగలను.

నలువైపులనుండి చుట్టుముట్టబడినట్లయింది నా స్థితి.

"అంతేకాదు. రాగిణి సర్ లాల్ చంద్‌కి నీవు పరారయిన ఖైదీ కృపాల్ సింగ్‌వని కూడా చెప్పింది. ఆయనవల్ల నాకూ నా ద్వారా పోలీసులకి తెలిసింది. వాళ్ళిద్దరితో పాటు వాళ్లు నిన్ను కూడా అరెస్టు చేస్తారు. నీ విప్పుడు పారిపోవాలను కున్నా పారిపోలేవు."

నా మోకాళ్లు కంపించాయి. తొడల్లో నరాలు విపరీతంగా కదిలాయి. నా జేబుల్లో వున్న ఇసుకసంచి, ముత్యాలహారం, ఏ క్షణంలోనయినా ప్రేలడానికి సిద్ధంగావున్న టైంబాంబు లలా వున్నాయి.

"అరె! నీ యీ కమీజుపై మరక లేమిటి?" ఆయన అడిగారు. అప్పటికే కళ్ళు చీకటికి బాగా అలవాటు పడటం వల్ల ఆయన నా షర్ట్ చూస్తూ అడిగారు.

నేను తల వంచి షర్ట్ చూసుకున్నాను. నా షర్టునిండా రక్తం. నా గొంతుక ఎండారిపోయి, నాలుక పిడుచకట్టుక పోతూంది. కళ్ళు తిరిగి నేల కొరిగాను.

డాక్టర్ గుప్తా చేయిచాచి నన్ను పడిపోకుండా పట్టుకున్నారు.

"అరె! ఇది నెత్తురులా వుందే!" అని ఆయన కంగారుగా అనటం నాకు లీలగా వినిపించింది.

—: అయిపోయింది :—